PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 12.04.2013, శుక్రవారం
సంపుటి : 32 సంచిక : 45
పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ?
సంరక్షణ కొరకు...
పురిటి పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)
Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# కాంగ్రెస్ అంతమే కిరణ్ పంతం

- ఈ రాష్ట్రానికి చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రికార్డు ఈయనకే సొంతం!
- కిరణ్ విధానాలతో కాంగ్రెస్‌కు అందమైన పాలరాతి సమాధి ఖాయం!!

ఏ దేశానికైనా మొదటి ప్రధానమంత్రి, ఏ రాష్ట్రానికైనా మొదటి ముఖ్యమంత్రి అనేవాళ్లు రికార్డులో వుంటారు. ఎందుకంటే ఆ రెండు చోట్లా మొదటి ప్రధాని మరియు మొదటి ముఖ్యమంత్రి అని వుంటుందిగాని చివరి ప్రధాని, చివరి ముఖ్యమంత్రి అని కాదు. కాని మన రాష్ట్రంలో అలాంటి అరుదైన రికార్డు సాధించేందుకు ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలిముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి అయితే చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి తానే కావాలనే కోరిక ఆయనలో బలంగా వున్నట్లుంది. అందుకు తగ్గట్టుగానే ఆయన పనితీరు వుంది.

ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పాలరాతి సమాధి కట్టడానికి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ ఇక అధికారంలోకి రాకూడదు... ఎందుకంటే ఈసారి ఎప్పుడు అధికారంలోకి వచ్చినా తాను సీఎం కాలేడు... అధిష్టానం అలా చేయదు కూడా! అలాంటప్పుడు ఇక్కడ పార్టీకే అంత సీన్ లేకుండా చేస్తే... కిరణ్ అదే చేస్తున్నాడు. కాంగ్రెస్‌కు ఓటేయమని ఎవరన్నా ఇళ్లకు పోతే జనం కర్రలు తీసుకుని తరిమికొట్టే పరిస్థితి తెచ్చాడు. లేకుంటే 2004లో చంద్రబాబు అనుభవాన్ని కళ్లముందు పెట్టుకుని ఎవరన్నా కరెంట్‌ఛార్జీలు ఇంత దారుణంగా పెంచుతారా? 2002దాకా చంద్రబాబు సక్సెస్‌ఫుల్ ముఖ్యమంత్రి. కరువుకాటకాలలో కూడా పరిపాలనా వ్యవహారాలను సమర్ధ వంతంగా నిర్వర్తించాడు.

(మిగతా 11వ పేజీలో)

## నందమూరి కుటుంబంలో...



# అన్నదమ్ముల సవాల్



- నాడు తండ్రీ కొడుకుల మధ్య చిచ్చు
- నేడు సోదరుల మధ్య రొచ్చు
- అన్నింటికీ సూత్రధారి బావగారే!

**నందమూరి వంశంలో అంతర్గత విభేదాలు అమలాపురం బ్లోఅవుట్‌ను తలపిస్తున్నాయి. క్రమక్రమంగా అవి తెరకెక్కుతున్నాయి. బతకనేర్చిన బావ చంద్రబాబు చేతుల్లో పడి నందమూరి అన్నదమ్ములు తామే ఒకర్నొకరు తన్నుకునే పరిస్థితికి లోనవుతున్నారు.**

పెద్దఎన్టీఆర్, చిన్న ఎన్టీఆర్‌ల ఫోటోల వివాదం ఎన్టీఆర్ కుటుంబంలో మరో చిచ్చుపెట్టింది. అన్నదమ్ముల మధ్య అగ్నికి ఆజ్యం పోసింది. నాటి సీనియర్ ఎన్టీఆర్‌కు, నేటి జూనియర్ ఎన్టీఆర్‌కు వీరాభిమాని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని. అలాంటి వీరాభిమాని చంద్రబాబు పోకడలు నచ్చక ఈమధ్య వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం తెలిసిందే! నాని తెలుగుదేశం పార్టీనైతే వదిలాడుగాని, జంట ఎన్టీఆర్‌ల మీద వున్న తన అభిమానాన్ని మాత్రం వదులుకోలేదు. ఇటీవల కృష్ణా జిల్లాలో పాదయాత్ర నిర్వహించిన జగన్ సోదరి షర్మిలకు స్వాగతం పలుకుతూ నాని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీకటౌట్‌లలో ఇద్దరు ఎన్టీఆర్‌ల ఫోటోలు ప్రత్యక్షమయ్యాయి. ఇంకేముంది చంద్రబాబుకు సెగ తగిలింది. తెలుగుదేశం నాయకులకు తిక్కరేగింది. ఎన్టీఆర్ ఫోటోలు మా పేటెంట్ హక్కు అన్నట్లుగా మాట్లాడారు. చంద్రబాబు వియ్యంకుడు, యువరత్న బాలకృష్ణ అయితే 'సింహా'వతారమెత్తాడు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఫ్లెక్సీలలో జూనియర్ ఫోటో వుండడాన్ని ఆక్షేపిస్తూ దానికి ఆయనే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ సమయంలోనే జూనియర్ ఎన్టీఆర్ జోక్యం చేసుకుని తనకు సినిమాలు, తల్లిదండ్రులే లోకమని, తనను అనవసర వివాదాల్లోకి లాగవద్దని కోరుకున్నాడు.

అయితే చంద్రబాబు, బాలకృష్ణలకు నందమూరి హరికృష్ణ మాత్రం ఘాటుగా సమాధానమిచ్చాడు. ఒకప్పుడు ఎన్టీఆర్ ఫోటోనే ఎక్కడా కనిపించకూడదన్నట్లు ప్రవర్తించిన వారికి ఇప్పుడు ఆయన ఫోటోను గురించి అడిగే అర్హతలేదన్నాడు. ఎన్టీఆర్ అందరి మనిషని, ఆయన ఫోటోను అందరూ వాడుకోవచ్చన్నట్లు బల్లగుద్ది చెప్పాడు.

చంద్రబాబుకు ఎన్టీఆర్ కుటుంబం కూరలో కరివేపాకులాగా మారింది. అవసరం వున్నప్పుడు వాడుకోవడం, ఆ తర్వాత ఏరిపారేయడం ఆయన నైజం. ఎన్టీఆర్ తనయులను, కుటుంబసభ్యులను అడ్డం పెట్టుకునే ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుండి దించారు. లక్ష్మీపార్వతిని బూచిగా చూపించి ఎన్టీఆర్‌కు ఆయన తనయులను శత్రువులుగా మార్చేసాడు. తాను ముఖ్యమంత్రి కుర్చీనెక్కగానే, తన మామ వెన్నుపోటు ఆపరేషన్‌కు సహకరించిన తోడల్లుడు దగ్గుపాటి వెంకటేశ్వరరావును పార్టీ వదిలిపోయేలా చేసాడు. ఆ తర్వాత నందమూరి హరికృష్ణకు చెక్‌పెట్టి ఆయననూ

(మిగతా 11వ పేజీలో)

## విజయనామ ఉగాది...

# విజయాలే పునాది!

(వివరాలు 2వ పేజీలో)



ఈ నెల 11వ తేదీ నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకలలో తెలుగు పంచాంగం కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా న్యాయమూర్తి శ్రీరామమూర్తి, డిఆర్‌ఓ బి.రామిరెడ్డి, డిపిఆర్‌ఓ కమలాకరరెడ్డి, ఆలూరి శిరోమణిశర్మ, బి.వి.నరసింహం

రేపటి నుండి...



This Season's Biggest Collection.
Just for you.
Bridal
Collective
Flat 20% off
అన్ని రకాల వస్త్రాలపై
కళానికేతన్
షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677

PDF Compressor Free Version



## మాజొడ్డ్ ఉగాది

- చిన్ని నారాయణరావు



ఏ విజయాలకు పునాదిగా
ఈ ఉగాది అరుదెంచిందో మరి
ఎవరికీ అంతుబట్టడంలేదు
ఈ నేలలో ఉగాదులు ఉషస్సులు
లాంటి వెలుగుపూలచెట్లసలు
చిగురించవు
మనిషి ఘర్మజలం గుడి
కట్టాల్సిన చోట
నెత్తిన వేలాడే కత్తిలా
టెర్రరిజం వేళ్ళూనడం
భయవిహ్వలమే మరి
మనిషి ఉత్పాతమై ప్రవహిస్తే
నిస్సారమైన భూముల్లో జిల్లేళ్ళు
మొలకలెత్తవా
దోపిడీ రాజ్యంగా దగాసేద్యంగా
చరిత్రహీనమ్మైన కాలమ్మిది
ఆడది కన్పడితే చాలు
చొంగకార్చుకొనే కీచక పర్వానికి
పరాకాష్టలై ఎగబడే..ఎగిసిపడే
అలల్లా వెంటపడే జాతిని
విజయం ఆవహిస్తుందా
నిర్భయను నిలువెత్తు క్రౌర్యం
పొట్టన పెట్టుకొన్నాక
ఓ నిండు జ్యోతిని ఆర్పేసాక
ఉగాది విరబూస్తుందా
కొత్తదనం ఇంకెక్కడ
పరవళ్లు తొక్కుతుంది
వీధి చివర్లో బడ్డీగా మారిన
దొడ్డ మనిషికి
జీవితం పొలమారాక
బ్రతుకు అద్దాలో గడ్డిమేయక
తప్పదు కదా మరి
ఊరు ఊరంతా షాపింగ్ ప్రపంచమై
నాలుగు రోడ్ల కూడలిలో
సామాన్యుణ్ణి ఉరితీసాక
మనిషిని గొడ్డుతో
సమంగా చూసే మాల్స్‌లో
సేల్స్ మెన్‌లకు నిలువులోతు
శిలువ వేసాక
అదో వధ్యశిలగా మనడం లేదా
ఈ క్రూయల్స్ కథనాలు
ఏ విజయానికి సంకేతమని
ఉగాదికి పలుకుదాం స్వాగతం
మెల్లమెల్లగా సవ్వడి చేయక
వెళ్ళిపో ఉగాదీ...!
పండుగవై కన్నీరు తుడవలేని
నీవురావడం దండుగే కదా
ఇదస్సలు విజయంకానే కాదు
మానవజాతికి అపజయం
ఘోర పరాజయం!!!

# విజయాలకు పునాది... విజయనామ ఉగాది

గురువారం విజయనామసంవత్సర ఉగాది వేడుకలు నెల్లూరు నగరంలో అత్యంత వైభవంగా జరిగాయి. మామిడితోరణాలు, అరటిపిలకలతో ప్రతి ఇంటిని అలంకరించి ఉగాది పచ్చడితో షడ్రుచులను ఆస్వాదించారు ప్రజలు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా పురుషులు, మహిళలు, పిల్లలు వేసుకున్న వస్త్రధారణ ఎంతగానో ఆకట్టుకుంది. జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలు కనులపండువగా జరిగాయి. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా న్యాయమూర్తి శ్రీరామ్మూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డి, జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి కమలాకర్‌రెడ్డి వంటి ప్రముఖులు పట్టుపంచ, పట్టుచొక్కాలతో తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఈ వేడుకలకు విచ్చేసి నిండుతనాన్ని తెచ్చారు. జ్యోతి ప్రజ్వలనతో ముఖ్యఅతిథులు ఈ వేడుకలను ఆరంభించి తెలుగు సంస్కృతి, తెలుగుభాష గొప్పతనాన్ని గురించి వివరించారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వారు నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా కవితాగానం, కవులకు, సాహితీవేత్తలకు పురస్కారం, పంచాంగశ్రవణం వంటి కార్యక్రమాలు జరిగాయి.



ఉగాదిపచ్చడి రుచి చూస్తున్న శ్రీరామ్మూర్తి, బి.శ్రీధర్, రామిరెడ్డి



టౌన్‌హాల్‌లో జరిగిన వేడుకల్లో కవులను సత్కరిస్తున్న ముంగమూరు, వి.హాజరత్‌బాబు తదితరులు

**టౌన్‌హాల్‌లో...** నెల్లూరు పురమందిరంలో సాయంత్రం విక్రమ సింహపురి సంగీతసభ, టౌన్‌హాలు పాలక మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకలు అబ్బురపరచాయి. ఈ వేడుకలలో నెల్లూరునగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వి.హాజరత్‌బాబు, పంచాగ్నుల విశ్వనాథం, పి.రంగారెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అలాగే వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఏడుమందిని సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సహస్రసభాసింహం బి.వి.నరసింహం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## 'టి.వి9' కృష్ణమోహన్‌కు సమైక్యభారతి అవార్డు



కృష్ణమోహన్‌కు అవార్డునందజేస్తున్న కేంద్రమంత్రి కపిల్ సిబాల్

ప్రతి ఏటా ఉగాది సందర్భంగా పలురంగాలలో లబ్ధ ప్రతిష్ఠులైన వారి సేవలకు గుర్తింపుగా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందించే ఢిల్లీ తెలుగు అకాడమీ ఇటీవల ఉగాది ఉత్సవాలు–2013 పురస్కరించుకొని ఢిల్లీలో వివిధ రంగాలలో ప్రముఖులకు అవార్డులు ప్రధానం చేసింది. అందులో నెల్లూరీయుడైన టీవి9 సీనియర్ ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ కృష్ణమోహన్‌కు సమైక్య భారతి గౌరవ సత్కార్ అవార్డును కేంద్రమంత్రులు కపిల్‌సిబాల్, కిల్లి కృపారాణి చేతుల మీదుగా ప్రదానం చేసింది. సునామీ సందర్భంలో భయానక దృశ్యాలు, వరదబాధితుల వేదన, జోగినీ వ్యవస్థలో ఆక్రందనలు, ఎర్రచందనం అక్రమరవాణా అంశాలపై కృష్ణమోహన్ అందించిన అద్భుత వాస్తవ కథనాలను గుర్తించి అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంలో ప్రముఖ సినీనటులు కైకాల సత్యనారాయణకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రధానం చేసారు. కార్యక్రమంలో ఢిల్లీలోని తెలుగు ప్రజలు, ఐ.ఎ.ఎస్‌లు, ఐ.పి.ఎస్‌లు పలువురు ప్రముఖ సినీనటులు పాల్గొన్నారు.

## కనులవిందుగా 'రెయిన్‌బో' వార్షికోత్సవం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో పాఠశాల ప్రీప్రైమరీ వార్షికోత్సవం కలర్స్ 2013 బుధవారం అనిల్‌గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణ వైద్యకళాశాల డైరెక్టర్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డా॥ జి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన విద్య రెయిన్‌బో పాఠశాలలో అందుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనులవిందుగా సాగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణా స్వయంప్రభ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి ఫాతిమాఖాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానవత్వమా... నీకు జోహార్



బుధవారం నెల్లూరుజిల్లా రామన్నపాళెం సమీపంలో యల్లాయపాళానికి చెందిన షేక్ మహమ్మద్‌ను ట్రాక్టర్‌రోడ్డు క్రాస్‌చేస్తూ ఢీకొన్న ఫలితంగా మహమ్మద్ తీవ్రగాయాలతో ట్రాక్టర్ టైర్ల క్రింద చిక్కుకున్నాడు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ బండిని వదిలేసి పరారయ్యాడు. బాధితుడు తనను రక్షించాలని కేకలు వేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఆ సమయంలో కావలి డీఎస్పీ ఇందిర నెల్లూరు నుండి కావలి వెళ్తూ కేకలు విని తన వాహనాన్ని నిలిపి తన సిబ్బంది సహాయంతో ట్రాక్టర్ క్రింద పడివున్న మహమ్మద్‌ను బయటకు తీసి తన వాహనంలో నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారమందించారు. మహమ్మద్ తలకు తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. సకాలంలో అతన్ని తీసుకురాకుంటే ప్రాణాలు పోయేవని డాక్టర్లు తెలిపారు. సరైన సమయంలో మానవత్వాన్ని చాటుకున్నారు కావలి డీఎస్పీ ఇందిర. మానవత్వమా... నీకు జోహార్లు!

## నెల్లూరు విద్యార్థికి 'నాసా' ఆహ్వానం



నెల్లూరు ఫత్తేఖాన్‌పేటకు చెందిన బి.శ్రీలత, వెంకటేశ్వరరావు కుమారుడు బి.అభిషేక్‌కు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాసా నుంచి ఆహ్వానం అందింది. ఈ నెల 23 నుండి 27వతేదీ వరకు కాలిఫోర్నియాలోని సాన్‌డిగోలో జరిగే 32వ అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమీక్షా సమావేశానికి హాజరుకానున్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంతో కలసి అభిషేక్ వెళ్ళనున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు అమెరికాలోని నేషనల్ ఏరోనాటికల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) ప్రతి సంవత్సరం స్పేస్ సెటిల్‌మెంట్ డిజైన్ కాంటెస్ట్ నిర్వహిస్తుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా 19దేశాల నుంచి 450ప్రాజెక్టుల ప్రయోగాలను 1120 మంది విద్యార్థులు నాసాకు పంపించారు. వీటిలో 169 ప్రయోగాలను నాసా ఎంపికచేయగా వాటిలో రాష్ట్రానికి చెందిన 9ప్రయోగాలు ఉన్నాయి. వీటిల్లో ద్వితీయ బహుమతులు వచ్చిన ప్రయోగాల్లో నెల్లూరు విద్యార్థికి చెందిన "ధ్రువ ప్రయోగం" ఉంది. ఈ ప్రయోగ రూపకల్పనలో నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలకు చెందిన బివి అభిషేక్(10వతరగతి) ఉండటం విశేషం. అంతరిక్షంలోని ఒక పొరలో కేవలం నీటితో బతికే మొక్కలు పెంచే విధంగా ప్రయోగాన్ని తయారుచేసి దానికి "ధ్రువ" అనే నామకరణం చేశారు.

GRAND OPENING
Celebrations
tiffins
Pure Veg.
Opp. Celebrations Multicuisine Restaurant,
Magunta Layout Main Road, Nellore.
April 13th 2013
8 am to 9 am

With the Best Compliments from
Celebrations
Multicuisine Restaurant
forest Theme Dining
Magunta Layout Main Road, Nellore.
Mobile : 98489 02222, 98489 06666

PDF Compressor Free Version



# సోమిరెడ్డికి అన్నీ ఆఫర్లే...



**జిల్లా తెలుగుదేశంపార్టీలో సీనియర్ నాయకుడిగా మిగిలివున్న అతికొద్దిమందిలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒకరు.**

2004 నుండి సోమిరెడ్డికి వరుసగా ఎదురుదెబ్బలే! సర్వేపల్లి నుండి రెండుసార్లు ఓడిపోవడమేకాక, మొన్న కోవూరు ఉపఎన్నికలలోనూ పోటీచేసే అభ్యర్థి లేక తానే నిలబడి ఓటమిపాలయ్యాడు. 2006జడ్పీ ఎన్నికలలో ఛైర్మెన్ సీటు లక్ష్యంగా పోటీచేసి పెళ్ళకూరు జడ్పీటీసీగా సరిపెట్టుకున్నాడు. గత పదేళ్లలో రాజకీయంగా మంచి దెబ్బలే పడ్డాయి. మానసికంగా బలహీనుడయ్యుంటే చాలామంది నాయకుల లాగా సోమిరెడ్డి కూడా ఇదివరకే కాంగ్రెస్‌లోకో, వైయస్సార్‌సీపీలోకో వెళ్ళుండేవాడు. కాని అందరి రాజకీయ నాయకుల్లా తానూ వుండకూడదనే చిత్తశుద్ధితో తెలుగుదేశాన్నే అంటి పెట్టుకుని వున్నాడు.

రేపటి ఎన్నికలలో కూడా ఆ పార్టీ అధికారంలోకి రాదని ఆయనకు తెలుసు. అయినా కూడా తాను నమ్ముకున్న సిద్ధాంతాన్ని వదులుకోవడం లేదు. 2009దాకా కూడా ఎన్నికలంటే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గం అభ్యర్థే! కాని ఇప్పుడా పరిస్థితి లేదు. జిల్లాలో గూడూరు, సూళ్లూరుపేట రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు, ఉదయగిరి, కావలి, ఆత్మకూరులు తప్పితే మిగిలిన 5అసెంబ్లీల నుండి ఆయన పేరు వినిపిస్తుంది. సర్వేపల్లి ఆయనకు పాత నియోజకవర్గం. కాబట్టి ఇక్కడ నుండి పోటీచేస్తారనే వాదన సబబే! మొన్న ఉపఎన్నికలలో కోవూరు నుండి పోటీ చేసారు కాబట్టి రెండోదఫా కూడా దిగితే కొంత సానుభూతి ఓటు రావచ్చుననే ఆలోచనా వుంది. అదీగాక విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాలలో ఆయనకు కొంత పట్టుంది. ఈసారి సోమిరెడ్డి నెల్లూరురూరల్ నుండి పోటీచేస్తారనే ప్రచారం బలంగా వుంది. ఆయన సొంత గ్రామం అల్లీపురం రూరల్ పరిధిలోకే వస్తుంది. రూరల్ గ్రామాలలో తెలుగుదేశంకు కొంత కేడర్ కూడా వుంది. నెల్లూరు నగరం నుండయితే జగన్‌గాలిని ఢీకొని గట్టిపోటీ ఇవ్వగలడనే టాక్ కూడా వుంది. నగరంలోని తూర్పు ప్రాంతంలో తెలుగుదేశంకు కొంత ఓటు బ్యాంకు వుంది. సరైన నాయకుడు లేక ఈ ఓటుబ్యాంకు అంతా చెల్లాచెదురైంది. సోమిరెడ్డి ఇక్కడ నుండి బరిలోవుంటే పాత ఓటుబ్యాంకునంతా సమీకరించగలడనే నమ్మకమూ వుంది. ఇవిగాక వెంకటగిరిలోనూ ఆయన పేరు వినిపిస్తుంది. అయితే సిటింగ్ ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ వున్నాడు కాబట్టి సోమిరెడ్డి అవసరం అక్కడ అంతగా వుండకపోవచ్చు.

సోమిరెడ్డికి ఇంకో ఆఫర్ కూడా వుంది. నెల్లూరు లోక్‌సభకు గట్టి అభ్యర్థి దొరక్కపోతే ఇక్కడనుండి సోమిరెడ్డే పోటీ చేయాల్సివస్తుంది. మొత్తానికి సోమిరెడ్డికి ఎక్కడ పోటీ చేయాలనుకుంటే అక్కడ అవకాశం వుండడం విశేషం. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన మళ్ళీ కోవూరు నుండి పోటీచేస్తే ఈసారి గెలుపుఖాయమన్న ధీమా కూడా ఆయన అభిమానుల్లో ఉంది.

# జిల్లాలో పెరిగిన రెవెన్యూ డివిజన్లు

## మండలాల మార్పులు... చేర్పులు

జిల్లాలో ఇంతవరకు నెల్లూరు, కావలి, గూడూరు రెవెన్యూ డివిజన్‌లు మాత్రమే వుండేవి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషితో ఆత్మకూరు, నాయుడుపేట రెవెన్యూ డివిజన్‌లు ఏర్పడ్డాయి. ఈ రెండు డివిజన్‌ల రాకతో పలు మండలాల ప్రజలకు రెవెన్యూ పరంగా ఎన్నో సమస్యలు తీరనున్నాయి. నెల్లూరురెవెన్యూ డివిజన్ పరిధిలోకి బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, టిపిగూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు మండలాలు వస్తాయి. నెల్లూరుకు పక్కనేవున్న కోవూరు మండలం ఇంతకుముందు 50కిలోమీటర్ల దూరంలో వున్న కావలి డివిజన్‌లో వుండేది. ఇప్పుడు ఆ మండలాన్ని నెల్లూరు డివిజన్‌లో చేర్చడం వల్ల ప్రజలకు కొంత వెసలుబాటు కానుంది. గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సైదాపురం, దక్కిలి, (మిగతా 5వ పేజీలో)



కర్నాటక ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో మరీ వస్తాడు... కావలిలో దిగి నేరుగా ఆ స్వామి వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకుంటారు.. ఓ కేంద్రమంత్రి అయితే ఈ స్వామికి రెగ్యులర్ కస్టమర్. నెల, రెండు నెలలకోసారన్నా ఓట్లేసి గెలిపించిన సొంత నియోజకవర్గానికి వెళతాడో లేదో గాని క్రమం తప్పకుండా ఈ స్వామీజీ వద్దకు వస్తుంటాడు. ఆంధ్రప్రదేశ్‌లో మాస్తే చాలామంది మంత్రులు ఈయనకు భక్తులు. అదేం విచిత్రమో... గతంలో ఓ పోలీసు అధికారి డిజిపి కాగానే ఈ స్వామి ఆశ్రమానికి వచ్చి ఆశీస్సులు అందుకునిపోయాడు. ప్రస్తుత డిజిపి అయితే ఇప్పటికే డిజిపి అయ్యాక మూడుసార్లు ఆశ్రమానికి వెళ్లాడు. ఆ స్వామి దగ్గర లేదా ఆ స్వామి ఆశ్రమంలో ఏదో మహత్యం ఉండాలి... లేదంటే వీరందరికీ ప్రయోజనం కలిగే అంశమేదన్నా వుండాలి. లేదంటే ఇంతమంది పొలిటీషియన్లు రావడమేంటి?

# ఏం మాయ చేసాడో గాని...

- శ్రీరామదూత మహత్యం
- ఎగబడి వస్తున్న వివిపిలు
- స్వామికి కార్పొరేట్ ఇమేజ్



ఆశీస్సులందుకుంటున్న డిజిపి దినేష్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, యాగంలో పాల్గొన్న జయప్రద



ప్రసంగిస్తున్న బ్రహ్మానందం, పక్కన టియస్ఆర్, యాగానికి హాజరైన రాజకీయ ప్రముఖులు

ఇంతమంది వివిపిలను ఆకర్షిస్తున్న ఆ ఆశ్రమం ఎక్కడో లేదు. కావలి దాటాక జాతీయ రహదారి పక్కన గుడ్లూరు మండలం పరిధిలోకి వచ్చే చేవూరు గ్రామంలో వుంది. అదే రామ దూత ఆశ్రమం.

ఈ ఆశ్రమానికి తరచూ వివిపిల తాకిడి వుంటుంది. అలాగే ఈ నెల 7వ తేదీన కూడా ఇక్కడికి వివిపి భక్తులు క్యూకట్టారు. ఆరోజు రామదూత వేణుదత్త లక్ష్మీ సువర్ణ దాంపత్య యాగం నిర్వహించారు. ఆ యాగంలో పాల్గొనేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ, కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి గీతారెడ్డి, పీసీసీ మాజీచీఫ్ డి.శ్రీనివాస్, రాజ్యసభసభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, మాజీఎంపీ అమర్‌సింగ్, ఎంపీలు జయప్రద, రాయపాటి సాంబశివరావు, డిజిపి దినేష్‌రెడ్డి, సినీహాస్యనటులు బ్రహ్మానందం, సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, మాజీఎమ్మెల్యేలు మాగుంట పార్వతమ్మ, దివి శివరాం, ఇంకా పలువురు ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ అధికారులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఇంతమంది వివిపిల రాకతో ఈ ఆశ్రమమే వివిపిల ఆశ్రమంగా మారిపోయింది. రామదూత ఈ వివిపిలకు ఏం మహత్యం చూపిస్తున్నాడోగాని వారంతా రామదూతకు బంటులయ్యారు.



- ట్వంటీ20... యువకుల పాలిట ఫోర్20
- మూడుగంటల్లో జీవితాలు తారుమారు

# 'ఐపి' ఎల్ ముంచుతోంది

నెల్లూరు చిన్నబజారులో ఓ యువకుడు... చేతికి బ్రాస్‌లెట్, ఐదువేళ్లకు ఐదు ఉంగరాలు... మెడలో లావుసైజు బంగారు దండ.. ఎప్పుడూ పల్సర్‌బైక్ వేసుకుని దర్జాగా వ్యాపారం చేసుకుంటూ వుండేవాడు. చేతిలో ఆయాచితంగా డబ్బు వచ్చిపడుతుంటే మనసు మందు, మగువ, పందేలు వంటివాటి మీదకు దౌడు తీస్తుంటుంది. అలాగే వాడి మనసు అనిల్‌కుంబ్లే విసిరిన బంతిలాగా వేగంగా క్రికెట్ పందేలమీదకు మళ్లింది. ఇంకేముంది మెడలో దండ, చేతికున్న బ్రాస్‌లెట్, వేళ్లకున్న ఉంగరాలు మార్వాడి కొట్టులోకి వెళ్ళగా, పల్సర్ బైక్ అప్పులవాళ్ల చేతుల్లోకి పోయింది. ఇప్పుడా యువకుడిలో మునుపటి దర్జాలేదు... దర్పమూలేదు. అలాగే ఆత్మకూరులో ఫ్యాన్సీషాపు నడుపుకునే కుర్రాడు క్రికెట్ పందేల పిచ్చిలో పడ్డాడు. చేస్తున్న వ్యాపారం చచ్చుబడిపోయింది. క్రికెట్ పందేలలో ఇతను చతికిలబడ్డాడు. ఆస్తులు కరిగిపోయి అప్పులు మిగిలాయి. ఇంకేముంది... క్రికెట్ పందేలు కాయడానికి డబ్బుకోసం మోటార్‌బైక్‌ల దొంగగా మారి చివరకు పోలీసులకు చిక్కాడు. క్రికెట్ పందేల మాయలో పడి ఇలాంటి వాళ్ళు ఎందరో జీవితాలను నాశనం చేసుకున్నారు. ఇంకా కూడా చేసుకుంటూనే వున్నారు.

ఇప్పుడు మళ్ళీ ఐపిఎల్ ఫీవర్ మొదలైంది. ఐపిఎల్ అంటే పందేలరాయుళ్ళకు పండుగే! బుకీలకయితే బ్రహ్మోత్సవమే. కేవలం నాలుగుగంటలలో పూర్తయ్యే ట్వంటీ20 మ్యాచ్‌పై ఒక్కో చోట లక్షల్లో పందేలు కాస్తున్నారు. అన్నిచోట్లా కలిపి ఒక్కరోజులోనే పందేలు కోట్లలో వుంటున్నాయి. నెల్లూరునగరంలో ఇంతకుముందు హోటళ్లలో గదులను అద్దెకు తీసుకుని పందేలు నిర్వహించే వాళ్ళు. అయితే పందేలరాయుళ్ళపై పోలీసుదాడులు ఎక్కువకావడంతో ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లలో పందేలు పెడుతున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారనే దానిమీదే కాకుండా ఓవర్‌కు ఎన్ని పరుగులొస్తాయి, ఆ బాల్ సిక్స్ కొడతాడా, (మిగతా 5వ పేజీలో)



# ప్రతిష్ఠ ఢమాల్

తెలివైన రాజకీయనాయకుడు ఏం చేస్తాడు... కార్యకర్తల మనసును గుర్తెరిగి వారు వెళ్లేదారిలో వరుగెత్తి వారిముందు నిలుచుంటాడు. అలా వెనుక జనాలున్నారని చూపించుకోగలుగుతాడు. అలా కాకుండా కార్యకర్తలు ఓవైపు పోతుంటే... ఈ నాయకుడు ఇంకో దారిలో వెళితే... వెనుక ఒక్కడూ వుండడు. ఈ జిల్లాలో మేకపాటి సోదరుల రాజకీయం కూడా అలాగే తగలబడి ఏడ్చింది. చేతకానితనంతో అనవసరంగా పరువు పోగొట్టుకున్నారు. వేను లేస్తే మనిషినికానని వికలాంగుడి సామెతను ఒకసారి గుర్తుకుతెచ్చారు.

జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మేకపాటి సోదరులు చెప్పిందే వేదం, జగన్ వాళ్ల మాట జవదాటడు. వాళ్ళు ఎవరికి చెబితే వారికే టిక్కెట్లు అనే వాతావరణం తెచ్చారు. ఇది నమ్మే చాలామంది వాళ్ల పంచన చేరారు. ఎవరిపాటికి వాళ్లు నియోజకవర్గాలను పంచుకుని మేమే అభ్యర్థులం అంటూ ప్రచారం చేసుకోసాగారు. కొత్తగా పార్టీలో చేరుతున్నవారందరికీ మేకపాటి ఇల్లు ఒక శిబిరంగా మారింది. దీంతో జగన్‌ను వెన్నంటి తొలుత వచ్చిన వారిలో కొంత కలవరం మొదలైంది. కాంగ్రెస్‌లో వున్న వాతావరణమే ఇక్కడా నెలకొన్నట్లు కనిపించ సాగింది. ఇక్కడా పైరవీలు పనిచేస్తాయా? పని చేసేవాళ్లకు అవకాశం వుండదా? అనే అనుమానాలు వచ్చాయి.

మేకపాటి సోదరులైతే నెల్లూరు నగరంలో అజీజ్‌కు, రూరల్‌లో ఆనం వెంకటరమణారెడ్డికి, కావలిలో మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డికి, వెంకటగిరిలో పాపకన్ను రాజశేఖర్‌రెడ్డిలకు... ఈ సీట్లు మీవేనని బాండ్ వ్రాసిచ్చినట్లు చెప్పారు. వాళ్ళంతా గ్యారంటీ ఇచ్చేసరికి ఆ నియోజకవర్గాలలో మొదటినుండి పనిచేస్తున్న వారిలో కొంత ఆందోళన నెలకొంది. అయితే చివరికి జరిగిన పరిణామాలను చూస్తే జగన్‌ను మేకపాటి సోదరులు చాలా తక్కువగా అంచనా వేసారనే విషయం అర్థమవుతుంది. జగన్ - కాంగ్రెస్ ఒకటి కాదని సమన్వయకర్తల నియామకంలో అర్థమవుతుంది. వైకాపా కార్యకర్తలు ఎవరెవరినైతే అభ్యర్థులుగా కోరుకుంటున్నారో జగన్ వారికే అవకాశమిచ్చాడు. మేకపాటి సోదరులను నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీలకు పరిమితం చేసి వారి ప్రభావం జిల్లా పార్టీపై పడకుండా చూసాడు. జిల్లా పార్టీలో మేకపాటి సోదరుల సీన్ ఇంతేననేది తేటతెల్లమైంది.

మొదట వారికి పార్టీలో పెద్దరికం వచ్చింది. దాన్ని నిలబెట్టుకునే అవకాశం కూడా వచ్చింది. సర్వేపల్లి నుండి కాకాణి, రూరల్ నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగరం నుండి అనిల్, వెంకటగిరి నుండి కొమ్మి లక్ష్మయ్య.. జగన్ మదిలో వున్న అభ్యర్థులు. వీళ్ళు పార్టీలో బాగా పనిచేస్తున్నారు కూడా!

మేకపాటి సోదరులు జగన్ మనసెరిగి, జిల్లాలో పరిస్థితులను గుర్తించి వీరినే తమ తరపున అభ్యర్థులుగా ప్రతిపాదించివుంటే వాళ్ల పెద్దరికం నిలబడేది. జిల్లాలోని నాయకులంతా వారిని గౌరవించే వాళ్ళు. అనవసర పంతాలకు పోయి జగన్ దగ్గర తమకు అంత సీన్‌లేదనే విషయాన్ని బట్టబయలు చేసుకున్నారు.

PDF Compressor Free Version






## జె.పి ఇంకా ఎదగాలి

నీతిపర జీవనపంథాతో, అత్యంత మేధావిగా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి జయప్రకాశ్ నారాయణ ఉత్తమ ప్రజాప్రతినిధిగా రాణిస్తున్నారు. మేధావి వర్గాన్ని ఆకర్షిస్తున్నారు. ఎన్నో ప్రత్యేకగుణాలు కలిగిన ఆయన ఇంకా పరిణితి చెందాలి. తన విధానాలను ప్రజలంతా అర్థం చేసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలి.

వాస్తు రామచంద్ర,
నెల్లూరు.

## కిరణ్ తప్పుకుంటే మేలు

ప్రభుత్వాన్ని నడపలేనప్పుడు ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి తప్పుకుంటే మంచిది. ప్రజలపై కరెంట్‌ఛార్జీలతో పెనుభారం మోపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచారు. అసలే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా వున్నాయి. ఈ దశలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రజల ఆర్థిక స్థితిని మరింత క్రుంగదీయడమే!

కె. వి. రాజు, మాచర్ల.

## రాహుల్‌కు అంత సీన్ లేదు

ఈమధ్య పారిశ్రామికవేత్తల సదస్సులో యువరాజు రాహుల్ గాంధీ బాగా మాట్లాడారని, ప్రధాని కావడానికి ఇంతకంటే అర్హతేం కావాలన్నట్లుగా కొందరి ప్రకటనలున్నాయి. రాహుల్‌గాంధీ కంటే బాగా మాట్లాడగలిగినవాళ్ళు ఈ దేశంలో కోట్లలో వున్నారు. వారందరినీ ప్రధానులు చేయలేం కదా! పరిపాలనా సామర్థ్యం నిరూపించుకున్న నరేంద్ర మోడీ, నితీష్‌కుమార్, నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ వంటి వారి నాయకత్వం దేశానికి అవసరం.

పెద్దపాళెం బుజ్జయ్య,
కావలి.

## జగన్‌ను తిడితే జనం హర్షించరు

ఢిల్లీ పెత్తనాన్ని వ్యతిరేకించి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ధిక్కరించిన ప్రజానాయకుడు వై.యస్.జగన్. ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా అధికార పక్షాన్ని విడిచి పెట్టి వై.యస్.జగన్‌ను తిట్టడానికే ప్రతిపక్ష తెలుగుదేశం తమ సమయాన్ని వినియోగించింది. జగన్‌ను తిడితే ప్రజామద్దతు పొందలేరు.


బి.ఆర్. శాలి, కావలి.

## 'ప్రభా'తం

మన దేశంలో అన్ని వ్యవస్థల్లోనూ అవస్థలు రాజ్యమేలుతుంటాయి. నూటికి నూరుపాళ్ళు సక్రమంగా పనిచేస్తుందన్న వ్యవస్థే లేదు. మన దేశ రాజకీయ వ్యవస్థ ఎంతగా గబ్బు పట్టిపోయిందో చూస్తున్నాం. ఇది రోజురోజుకు ఇంకా గబ్బుపట్టడం తప్పించి బాగుపడడం అన్నది జరిగే పని కాదు. మన దేశంలో వున్నంత ఛండాలపు రాజకీయ వ్యవస్థ బాగా వెనుకబడిన దేశాల్లో కూడా వుండదేమో! రాజకీయ వ్యవస్థ ఇంత నికృష్టంగా తయారుకాబట్టే ప్రభుత్వ వ్యవస్థలు కూడా దానికి తగ్గట్లే తగలబడుతున్నాయి. అధికారం అనే కేంద్రం చుట్టూ దేశంలోని అన్ని వ్యవస్థలూ తిరగాల్సి వస్తుంది.

దేశ పరిపాలనలో అధికార జోక్యం పెరిగి, చేతిలో అధికారం వుంటే ఏమైనా చేయవచ్చుననే ధీమా పెరిగిన నేపథ్యంలో రాజకీయ వ్యవస్థకు అడపాదడపా కళ్లెం వేస్తూ ప్రజల ఆకాంక్షలను నిలబెడుతున్నది న్యాయవ్యవస్థే! ఈరోజు అన్ని రాజ్యాంగ వ్యవస్థలు కూడా ప్రజల నమ్మకాన్ని కోల్పోయాయి. కాస్తోకూస్తో నమ్మకం వున్నది న్యాయవ్యవస్థ మీదే! అయితే ఇటీవల చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనలతో న్యాయవ్యవస్థలపై సైతం నీలినీడలు కమ్ముకునే పరిస్థితులు దాపురించాయి. గాలి బెయిల్... 100కోట్ల డీల్, వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి బెయిల్ రాకుండా చేయడం, చంద్రబాబునాయుడు అవినీతి ఆరోపణల మీద పిటిషన్ వేస్తే కనీసం విచారణకు కూడా ఆదేశించకుండా తిరస్కరించడం వంటివి న్యాయవ్యవస్థలో నెలకొన్న లొసుగులనూ బయటపెడుతున్నాయి. అయితే చిన్న చిన్న లోపాలున్నప్పటికి అధికారిక వ్యవస్థలు శ్రుతిమించి పోతున్నప్పుడు చివరకు న్యాయస్థానాలే జోక్యం చేసుకుని వాటిని దారిలో పెట్టడం గుడ్డిలో మెల్ల.

### న్యాయ అవస్థ



భారతదేశ న్యాయవ్యవస్థ ప్రజలకు సరైన సంపూర్ణమైన సేవలు అందించలేకపోతుంది. దీనికి ప్రధానకారణం న్యాయవ్యవస్థలో నెలకొన్న సమస్యలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని తొలగించలేకపోవడమే. ఈ సమస్యల మూలంగానే కోర్టుల్లో కేసులు కోట్లలో పేరుకుపోతున్నాయి.

కాని అలాంటి న్యాయవ్యవస్థే ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతుందనడానికి మొన్న ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రులు, హైకోర్టు న్యాయమూర్తుల సంయుక్త సదస్సు అద్దంపడుతుంది. న్యాయవ్యవస్థలో నెలకొన్న సమస్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అల్తమస్ కబీర్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు ఏకరువు పెట్టారు. దేశ ప్రధాని మన్మోహన్‌సింగ్, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలోనే దేశ న్యాయవ్యవస్థలో నెలకొన్న సమస్యల మీద విస్తృత చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా చాలా న్యాయస్థానాలలో మౌలిక సదుపాయాలే మృగ్యమయ్యాయంటూ జస్టిస్ కబీర్ అభిప్రాయపడ్డారు. ఈ వసతుల లేమి కారణంగా సుప్రీం కోర్టు నుండి దిగువస్థాయి కోర్టుల దాకా పేరుకుపోయిన పెండింగ్ కేసులు 3కోట్ల దాకా వున్నాయి. కాగా వీటిలో 70శాతం కేసుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ విభాగాలే వాదులుగానో, ప్రతివాదులుగానో వుండడం ఆశ్చర్యపరిచే విషయం. 2009లో జరిగిన న్యాయమూర్తుల సదస్సులో న్యాయవ్యవస్థలో మౌలిక వసతుల కల్పనకు శాయశక్తులా కృషి చేస్తామని ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. నిన్నటి సదస్సులో కూడా ఆయన అదే మాటను రిపీట్ చేయాల్సి వచ్చింది. అంటే సదస్సులు పెట్టినప్పుడు తప్పితే మిగతా సమయంలో న్యాయస్థానాలలో నెలకొన్న సమస్యలు గుర్తుకు రావడం లేదు.

భారత దేశంలో న్యాయస్థానాలు, కేసులు, తీర్పులు అంటేనే ఒక ప్రహసనంగా మారింది. ఒకడు యవ్వనదశలో ఒక నేరం చేస్తే వృద్ధాప్యంలోకి వచ్చేసరికి అతడికి శిక్షపడుతుంది. అంటే మన న్యాయస్థానాలలో కేసుల విచారణ అంత ఆలస్యంగా జరుగుతుందన్న మాట. కేసుల విచారణలో శిక్షల ఖరారులో విపరీతమైన కాలయాపన వల్ల ఈలోపే బాధితుల మనసు మారిపోవడం, కేసులను ఉపసంహరించుకోవడం, నిందితులు బయటపడడం వంటివి జరుగుతున్నాయి.

అమెరికాలో ప్రతి పదిలక్షల జనాభాకు 105మంది న్యాయమూర్తులున్నారు. కాని మన దేశంలో ప్రతి 20లక్షల మందికి కేవలం 31మంది న్యాయమూర్తులే వున్నారు. అమెరికాతో పోలిస్తే మన దేశంలో నేరాల సంఖ్య ఎక్కువ. భూవివాదాలు, ఆస్తి తగాదాలు, హత్యలు, వేధింపులు, దోపిడీలు... ఇలా అమెరికాలో కనిపించని చాలానేరాలు మన దేశంలో కనిపిస్తుంటాయి. ఉదాహరణకు ఒక న్యాయస్థానంలో ఒక రోజుకు నాలుగు కేసులను పరిష్కరిస్తే పదికేసులు కొత్తగా వస్తుంటాయి. ఈ లెక్కన నానాటికీ పేరుకుపోయే పెండింగ్ కేసుల శాతం పెరుగుతుందే తప్ప తగ్గడం అంటూ వుండదు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక వుండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ కలిసి ఒక ప్రక్రియను రూపొందించాలి. మండలస్థాయికి న్యాయప్రక్రియ చేరాలి. మండల కేంద్రాలలోనే దిగువస్థాయి న్యాయస్థానాలను ఏర్పాటు చేసి మండల పరిధిలో వచ్చే కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ముఖ్యంగా మన న్యాయస్థానాలలో సివిల్ కేసులే ఎక్కువగా నలుగుతున్నాయి. సమగ్రమైన రెవెన్యూ విధానాన్ని రూపొందించి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే, చాలా సివిల్ కేసులను కోర్టుకు రాకుండానే నివారించవచ్చు. లోక్‌అదాలత్ ప్రక్రియను విస్తృతం చేయడం ద్వారా ఎన్నో కేసులను పరిష్కరించవచ్చు. మాజీన్యాయమూర్తుల సేవలను ఉపయోగించుకోవడం, న్యాయస్థానాల పనిదినాలను పెంచడం, న్యాయస్థానాలలో ఖాళీలను భర్తీ చేయడం, కోర్టుల సంఖ్యను పెంచడం చేస్తే ఒక్కో కేసుకు కాలపరిమితి నిర్ణయించి పరిష్కరించవచ్చు. కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా ఈ దిశగా చొరవచూపి న్యాయ వ్యవస్థలో దశాబ్దాలుగా పేరుకున్న సమస్యలను తొలగించాల్సివుంది.

## 'అంతర్'జాతీయం

- పాకిస్థాన్ బాలికల విద్యా ఉద్యమకారిణి మలాలా యూసఫ్ జాయ్‌ని ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి బాన్‌కీమూన్ అభినందించారు. ఆమెతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సంభాషిస్తూ నువ్వు విశ్వపుత్రికవు, మా ఆశాజ్యోతివి అంటూ ఉద్వేగంగా మాట్లాడారు.
- వచ్చే ఏడాదికల్లా తమ బలగాలను ఆఫ్ఘాన్ నుండి ఉపసంహరించాలని అమెరికా భావిస్తుంది. అదే సమయంలో లష్కరేతోయిబా లాంటి సంస్థలు కాశ్మీర్‌పై దృష్టి సారించనున్నాయని అమెరికా మిలటరీ అకాడమీ హెచ్చరించింది. పాకిస్థాన్ భద్రతా విభాగంలోని శక్తుల అండతో ఈ ముష్కరమూకలు తమ ప్రణాళికలను రచిస్తున్నట్లు పేర్కొంది.
- ఐఏఎస్‌ల తరహాలోనే న్యాయమూర్తుల నియామకానికి ఆలిండియా జ్యూడీషియల్ సర్వీసెస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఎక్కువశాతం ముఖ్యమంత్రులు సమర్థించగా, ఎక్కువమంది న్యాయమూర్తులు అభ్యంతరం వ్యక్తం చేసారు. ఆదివారం ఢిల్లీలో ముఖ్యమంత్రులు, హైకోర్టుల ప్రధానన్యాయమూర్తుల సంయుక్త సదస్సులో ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.
- బ్రిటన్ తొలిమహిళాప్రధాని, ఉక్కుమహిళ మార్గరేట్ థాచర్ 8వ తేదీ లండన్‌లో కన్నుమూసారు. ఆమె వయసు 87ఏళ్ళు. కన్సర్వేటివ్ పార్టీ నాయకురాలైన థాచర్ 1979 నుండి 1990 వరకు మూడు పర్యాయాలు ప్రధానిగా పనిచేసారు. భారత మాజీప్రధాని ఇందిరాగాంధీ అంటే థాచర్‌కు ఎంతో అభిమానం.
- వికీలీక్స్‌ను ఉటంకిస్తూ మాజీప్రధాని రాజీవ్‌గాంధీపై 'ది హిందూ' ఆంగ్ల దినపత్రికలో వచ్చిన కథనం సంచలనం రేకెత్తిస్తుంది. స్వీడన్‌కు చెందిన సాబ్ స్కానియా అనే కంపెనీ 1970లో తన విగెన్ యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించేందుకు రాజీవ్‌గాంధీ మధ్యవర్తిగా వ్యవహరించారని ఈ కథనాలలో పేర్కొంది. రాజీవ్‌గాంధీ ఆ సమయంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా, ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా వున్నారు. బ్రిటన్‌పై ఇందిరాగాంధీకి వున్న దురభిప్రాయం దృష్ట్యా ఆ దేశానికి చెందిన జాగ్వార్ విమానాలను కొనరాదని నిర్ణయించుకుని స్వీడన్ కంపెనీ వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తుంది.
- సోమవారం బీజేపీ అగ్రనేతలకు విమానం ముప్పు తప్పింది. కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్, సీనియర్ నేతలు సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీలు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుండి ప్రైవేట్ జెట్‌విమానంలో బయలు దేరారు. గాల్లోకి లేచిన కొద్దిసేపటికే ఆటో పైలెట్ వ్యవస్థలో లోపం వున్నట్లు గుర్తించి పైలట్ తిరిగి ఢిల్లీ విమానాశ్రయంలో దించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- విద్యుత్ ఉద్యమం ఆగదు. - సీపీఐ నారాయణ.
వ్యాఖ్య :- **ఈ సీఎం జనానికి బదులు ప్రతిపక్షాలకు చేతినిండా పని పెడుతున్నాడు.**

వార్త :- నన్నెందుకు జైల్లో పెట్టలేదు. - పీసీసీ చీఫ్ బొత్స వ్యాఖ్య.
వ్యాఖ్య :- **తొందరగా వున్నట్లుందే... ఆరోజు కూడా రావొచ్చేమో! ఎవరు చూసారు!**

వార్త :- సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే. - కేంద్రమంత్రి చిరంజీవి.
వ్యాఖ్య :- **మీకు మంత్రి పదవి ఇచ్చారు కాబట్టా...?**

వార్త :- యూపీఏకు మద్దతు కొనసాగిస్తాం. - మాయావతి.
వ్యాఖ్య :- **కొనసాగించకపోతే జైల్లో వుంటారు.**

వార్త :- కులమతాలు చూసి పశువుల్లా ఓట్లేస్తున్నారు. - జస్టిస్ మార్కండేయ కట్జూ.
వ్యాఖ్య :- **దేశప్రజల మీద బాగా పగబట్టారే!**

వార్త :- అదిలాబాద్ కార్యకర్తల సమావేశంలో పిడిగుద్దులు. - రాహుల్‌దూత సమక్షంలో రచ్చరచ్చ.
వ్యాఖ్య :- **పార్టీ ఎంత పటిష్టంగా వుందో ఆయనకు ప్రత్యక్షంగా చూపించినట్లున్నారు.**

వార్త :- రాహుల్... రాష్ట్రానికి రండి. - సీఎం కిరణ్ ఆహ్వానం.
వ్యాఖ్య :- **రేపు పార్టీ పరాజయం పాలైతే ఆ నెపం ఆయన మీద వేయడానికా!**

వార్త :- అవినీతి మంత్రులకు సీఎం రక్ష. - చంద్రబాబు.
వ్యాఖ్య :- **రక్షించకపోతే కేబినెట్ ఖాళీ అవుతుందికదా!**

వార్త :- ఉచితవిద్యుత్ ఎత్తివేస్తే ఊరుకోం. - వైయస్సార్సీపి హెచ్చరిక.
వ్యాఖ్య :- **అసలు విద్యుత్ వుంటే కదా... ఎత్తేయడానికి.**

వార్త :- అది కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్. - సిబిఐ తీరుపై వెంకయ్య ఎద్దేవా.
వ్యాఖ్య :- **జీతాలు కూడా వాళ్లనే ఇవ్వమంటే సరి.**

వార్త :- ఛార్జీల పెంపును ప్రజలు అర్థం చేసుకున్నారు. - సీఎల్పి
వ్యాఖ్య :- **ఔను... ఈ ప్రభుత్వం ఇక ఎలాగూ తగ్గించదని అర్థం చేసుకున్నారు.**

PDF Compressor Free Version



# 'గ్రీన్‌టెక్' సాగర మధనం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీరామదూత

మనిషి నిరంతర అన్వేషి. ప్రపంచంలో నిత్యం ఎక్కడో ఒకచోట ఏదో ఒక కొత్త విషయం వెలుగు చూస్తూనే వుంటుంది. అయితే అద్భుతమైన ఆవిష్కరణలు మనిషి అభివృద్ధికి దోహదపడతాయి. అటువంటి ఆవిష్కరణే ఇక్కడ జరిగిందని చెప్పొచ్చు. ప్రవాస భారతీయుడు, ట్రేడ్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఛైర్మెన్ ఎం.కృష్ణప్రసాద్ ఉప్పునీటిని మంచినీరుగా మార్చడం సాధ్యమని తన ప్రయోగంతో నిరూపించాడు. ఈనెల 7న నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలం కోడూరు సముద్రతీరంలో గ్రీన్‌టెక్ సంస్థ ఛైర్మెన్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఉప్పునీటిని మంచినీరుగా మార్చే డెమో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. ప్రకాశం జిల్లాకు చెందిన రామదూత స్వామి ఆరు ప్లాంట్లను స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించారు. తాత్కాలికంగా వారు ఏర్పాటు చేసిన ఆరు ప్లాంట్ల ద్వారా మొదట ఉప్పు నీటిని తాగేందుకు వీలుగా శుద్ధిచేసి తియ్యని నీరుగా మార్చారు. ఇంకా ప్రక్రియలో మరో వారం రోజుల్లో గ్యాస్, విద్యుత్, యూరియా ఉత్పత్తి అవుతుందని ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ తెలిపారు. మూడేళ్ల పాటు తమ సంస్థ ఇంజనీర్లు శ్రమించి ట్రైటాన్ అనే బ్యాక్టీరియాను కనుగొని, తద్వారా ఉప్పునీటిలో ఐదు రకాల ప్రయోజనాలను పొందవచ్చని నిరూపించారని అన్నారు. కోటి లీటర్ల సముద్రపు నీటితో 30లక్షల లీటర్ల తాగునీటిని వెయ్యి ఎకరాలకు సాగునీటిని, 400 మెగావాట్ల విద్యుత్‌తో పాటు గ్యాస్ యూరియాను కూడా తయారుచేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు దేశాలకు చెందిన ప్రతినిధులు అన్వర్‌ముసఫ్, డాక్టర్ మాంబా, డాక్టర్ మైకన్, ప్రీణా, గ్రీన్‌టెక్ సంస్థ జనరల్ సెక్రటరీ రూప మొదలగువారు పాల్గొన్నారు.

# చూడు పిన్నమ్మా.. పాడు పిల్లోడు!

## హిజ్రానంటూ దోపిడీ చేస్తుండు...



ర్యాలీ నిర్వహిస్తున్న హిజ్రాలు

హిజ్రానంటూ అనిల్ కుమార్ అనే వ్యక్తి అలేఖ్యగా పేరు మార్చుకుని హిజ్రాలపై దాడులు చేస్తూ, దాదాగిరి చేస్తున్నారని సోమవారం నెల్లూరులో హిజ్రాలు ర్యాలీచేసి అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అలేఖ్యపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. హిజ్రాల నాయకురాలు ఆసిం మాట్లాడుతూ అనిల్‌కుమార్ అనే వ్యక్తికి పెళ్ళయి ముగ్గురు పిల్లలున్నారని, హిజ్రా ముసుగులో సునాయాసంగా డబ్బులు సంపాదించడానికి అలవాటు పడ్డారన్నారు. అనిల్‌కుమార్ ప్రత్యేక చికిత్స ద్వారా అలేఖ్యగా పేరు మార్చుకొని హిజ్రాల మీద రౌడీయిజం చేస్తున్నారన్నారు. జాతీయ రహదారి మీద పోయే వాహనాలను ఆపి దోచుకుంటున్నారన్నారు. గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, చిత్తూరుకు చెందిన హిజ్రాలపై రౌడీలతో దాడులు చేయిస్తూ నెల మామూళ్ళు వసూలు చేస్తున్నారన్నారు. హిజ్రా ముసుగులో దౌర్జన్యాలు, దోపిడీలు, దాడులకు పాల్పడుతున్న అనిల్ కుమార్ అలియాస్ ఆలేఖ్యను వెంటనే శిక్షించాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఈ ధర్నా కార్యక్రమంలో అను, సుధ, కాంతమ్మ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

# మార్పులు చేర్పులు

(3వ పేజీ తరువాయి)

వెంకటగిరి, బాలాయపల్లి మండలాలు వస్తాయి. కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలో కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి, జలదంకి, కలిగిరి, కొండాపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాలుంటాయి. దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు కావలి కన్నా ఆత్మకూరు డివిజన్ అయ్యుంటే కొంత దూరం తగ్గేదేమో!

కొత్తగా ఏర్పాటైన ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి ఆత్మకూరు, అనంతసాగరం, ఏ.ఎస్.పేట, చేజర్ల, మర్రిపాడు, సంగం, కలువాయి, ఉదయగిరి, సీతారాంపురం, వింజమూరు మండలాలు వస్తాయి. గతంలో సీతారాంపురం, ఉదయగిరి, వింజమూరు మండలాలు కావలి డివిజన్‌లో మిగిలిన మండలాలు నెల్లూరు డివిజన్‌లో వుండేవి. ఇప్పుడు ఆత్మకూరు ఈ మండలాలన్నింటికి సెంటర్ కానుంది. నాయుడుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోకి నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ, డి.వి.సత్రం, ఓజిలి, పెళ్ళకూరు, చిట్టమూరు మండలాలు వస్తాయి. ఇవన్నీ ఇప్పటివరకు గూడూరు డివిజన్‌లో వున్నవే!

# ముంచుతోంది

(3వ పేజీ తరువాయి)

ఫోర్ కొడతాడా, వికెట్ పడుతుందా, ఎన్ని ఓవర్లలో ఛేజింగ్ చేస్తారు... అనే అంశాలపై భారీగా పందేలు కాస్తుంటారు. ఐపిఎల్ మ్యాచ్‌లతో క్రికెట్ ఒక వుల్లాస పరచే క్రీడగా కంటే ఒక విలాసవంతమైన జూదంగా మారిపోవడం విచారకరం.

# బిట్రగుంట రైల్వేకు "కోట్ల" హామీలు



సభలో ప్రసంగిస్తున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో ఈనెల 6న జరిగిన బహిరంగసభలో కేంద్ర రైల్వే సహాయమంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొని పలు హామీలిచ్చారు. తాను కేంద్ర రైల్వే సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత రాష్ట్రంలో దక్షిణ మధ్యరైల్వే అభివృద్ధికి ఎంతో సహాయసహకారాలు అందించానని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణు వర్ధన్‌రెడ్డి అనేక పర్యాయాలు తనను కోరడంతో ఇక్కడ పర్యటిస్తున్నానని తెలిపారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి సాధక కమిటీ రైల్వే అభివృద్ధి కోసం పాటుపడుతూ పోరాటం చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలలోగా బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పిస్తానని హామీఇచ్చారు. అదే విధంగా రైల్వే అభివృద్ధి సాధక కమిటీ సూచించిన విషయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, విజయవాడ రైల్వే డిఆర్‌యం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో

# పార్టీ ఏర్పాటు విడనాడాలి

రాజకీయ లబ్ధికోసం, స్వార్థ ప్రయోజనాల కోసం మాదిగ కులం పేరుతో పార్టీని ఏర్పాటుచేసే ఆలోచనను ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విడనాడాలని లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాదిగ సీనియర్ సిటీజన్స్ ఫోరం కార్యదర్శి కాకుమాని చెంచు రామయ్య పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించేందుకే ఎమ్మార్పీయస్ ఉద్యమం ఏర్పడిందే తప్ప ఇంకో దానికి కాదన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం సామాజిక ఉద్యమం అన్న విషయం మంద కృష్ణ మాదిగ గుర్తుంచుకోవాలన్నారు. మాదిగల న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు ఏ రాజకీయ పార్టీ త్రికరణ శుద్ధిగా బలపరుస్తుందో ఆ పార్టీకి ఎన్నికల్లో మాదిగలు మద్దతు పలకాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా చర్మకార సంఘం అధ్యక్షుడు మన్నేపల్లి దాసు, ఎమ్మార్పీయస్ నాయుడు ఇంఢ్ల రామచంద్రయ్య పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఎంపిక

నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. వ్యవసాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడిగా డా॥ కె.వి.సుబ్బారావు, అధ్యక్షులుగా బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా డి.రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శిగా డా॥ హరి కరుణాకర్‌రెడ్డి, సంయుక్తకార్యదర్శిగా బి.శ్రీదేవి, కోశాధికారిగా పి.లలిత, మరో 13మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

# 100తో ఇక మహిళలకు శ్రీరామరక్ష

**డిజిపి దినేష్‌రెడ్డి**



కాల్‌సెంటర్ 100ను హైదరాబాద్‌కు అనుసంధానం చేయడంతో ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని రాష్ట్ర డిజిపి వేణుంబాక దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. 6వ తేదీ ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డిజిపి మాట్లాడుతూ జాతీయ రహదారుల్లో ఉన్న దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాబాల్లో మద్యం విక్రయం వల్ల ప్రమాదాల సంఖ్య పెరిగిందన్నారు. జిల్లాలో మహిళా కేసులను పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన కమిటీతో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని ఇదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కమిటీలను ఏర్పాటుచేసి కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 450కేసులకుగాను 110కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం ఏర్పాటుకు బొల్లినేని ఆసుపత్రి వద్దగల స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కంట్రోలు 100కాల్‌సెంటర్‌కు ఒక సిఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్, 6మంది కానిస్టేబుళ్ళు విధులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపన్ యూనివర్శిటీ పరీక్షకు ఖైదీలు



పరీక్ష వ్రాస్తున్న ఖైదీలు

అంబేద్కర్ ఓపన్ యూనివర్శిటీ నిర్వహించిన డిగ్రీ ప్రవేశ పరీక్ష రాసేందుకు జైలు అధికారులు ఖైదీలకు అవకాశం కల్పించారు. ఆదివారం జైలు ఆవరణంలోనే నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 54మంది ఖైదీలు హాజరయ్యారు. మొత్తం 57మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురు పెరోల్‌పై వెళ్ళారు ఈ పరీక్షలను యూనివర్శిటీ అబ్జర్వర్ ఎం.రమేష్‌బాబు, జైలు ఇన్‌చార్జి సుపరింటెండెంట్ ఎంఆర్ రవికిరణ్, అసిస్టెంట్ అబ్జర్వర్ గోవిందరెడ్డి, జైలర్ ఎం.వెంకటేశ్వర్లు, డిప్యూటీ జైలర్ రమేష్ అధ్యాపకుడు విజయకుమార్ పర్యవేక్షించారు. ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన వారు మూడేళ్ళ పాటు జైలులోనే విద్యను అభ్యసిస్తారు. డిగ్రీ మూడేళ్ళు పూర్తిచేసుకుని ఉత్తీర్ణులైన ఖైదీలకు జైలు నిబంధనలు ప్రకారం 30రోజులు రెమిషన్ ఉంటుంది.

# వికలాంగులకు సదావకాశం

శారీరక అంగవైకల్యము కలిగి చేతులు సక్రమంగా ఉండే పోస్ట్ గ్రాడ్యుయేట్, వృత్తి విద్యా కోర్సుల్లో చదువుతున్న వారికి మోటరైజ్డ్ ట్రైసైకిల్, సోఫెస్టికేటెడ్ ఉపకరణ పరికరములు కొనుగోలు నిమిత్తం బ్యాంకు ద్వారా ఋణము మంజూరుచేయుటకు హైదరాబాదు వికలాంగుల సహకార సంస్థ మేనేజింగ్‌డైరెక్టర్ నిర్ణయించారని వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయసంచాలకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఋణములు 50శాతంగాని, అత్యధికముగా 30వేలు వరకు సబ్సిడిగా మంజూరు చేస్తారన్నారు. ఋణసదుపాయానికి సంబంధించి దరఖాస్తులు నెల్లూరు కొండాయపాళెం, వసంతోపు, పాండు స్టీలు ఫ్యాక్టరి ఎదురుగా ఉన్న తమ శాఖ కార్యాలయంలో పొందవచ్చున్నారు.

# మండే ఎండలతో విలవిలలాడుతున్న నెల్లూరు

ఎండలు మండిపోతున్నాయి. మార్చి 22 నుంచి ముదిరిన ఎండలు ఏప్రిల్ నెల మొదటి వారానికి తీవ్ర రూపం దాల్చాయి. మరి మే నెలలో ఏ రీతిలో వుంటాయో అని ఆలోచిస్తుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఇపుడే నెల్లూరులోని ట్రంక్‌రోడ్, మినిబైపాస్ మొదలగు రహదారుల్లో 10,11గంటలకే ట్రాఫిక్ రద్దీలేకుండా తయారయింది. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు నెల్లూరులో ట్రాఫిక్ సమస్యను ఆ సూర్య భగవానుడు ఈ రీతిలో పరిష్కరించాడేమోననిపిస్తుంది. కాని రోడ్డు పక్క వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులే రెండు ప్రక్కల బాధననుభవించవలసి వస్తోంది. అటు ఎండదెబ్బను భరించినా ఇటు వ్యాపారం జరగక చిన్నబోతున్నారు. చింతపడుతున్నారు. సాయంత్రమయితేగాని రహదారులు జనంతో కళకళలాడడంలేదు. ఆరుగంటలకు గంప కింద కోడిపిల్లలు బయటపడ్డట్టు జనం ఒక్కసారిగా ఇళ్ళలోంచి వెలుపలకొచ్చి రోడ్ల వెంబడి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఎండలు ఎక్కువ వున్నా నెల్లూరులో కొంచెం తక్కువగా వుండేవి. కాని ఇప్పుడట్లా కాకుండా నిప్పులు చెరిగే ఎండకాసే రెంటచింతల, సింగరేణిలతో నెల్లూరు పోటీపడుతోంది. ఫ్! ఏంచేద్దాం ఇది కాలం మాయం! మనిషి చేసుకున్న స్వయం కృతాపరాధమో! ఏదేమైనా మండే ఎండలపట్ల మనం కాస్త జాగ్రత్త వహించాల్సిందే.

PDF Compressor Free Version



## నెల్లూరు కబుర్లు

# మళ్ళీ వస్తున్న ముఖ్యమంత్రి




రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 14వ తేదీన సూళ్లూరుపేటకు వస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు కోటపోలూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగే సబ్‌ప్లాన్ అవగాహనా సదస్సులో ఆయన పాల్గొంటారు. అనంతరం సూళ్లూరుపేటలో బహిరంగసభలో పాల్గొని సాయంత్రం 6గంటలకు బయలుదేరి వెళతారు. ఈనెల 1, 2, 3తేదీలలో ఆయన జిల్లాలో పర్యటించడం తెలిసిందే! పదిరోజులు తిరక్కముందే మళ్ళీ వస్తున్నారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, సూళ్లూరుపేట మునిసిపల్ కమీషనర్ కనకారావు ముఖ్యమంత్రి పర్యటనకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఆనం పర్యటన:** రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 12వ తేదీ నెల్లూరు వస్తారు. ఆరోజు ఇందిరాభవన్‌లో జరిగే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 13వ తేదీ సూళ్లూరుపేటకెళ్లి ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను పరిశీలిస్తారు. 14వ తేదీ ఇక్కడే ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొని రాత్రికి నెల్లూరులో బసచేసి 15వ తేదీ ఉదయం హైదరాబాదుకు బయలుదేరి వెళతారు.



ఈ నెల 9వ తేదీ సూళ్లూరుపేట మండలం కోటపోలూరులో గిరిజనులతో కలసి సంహపంక్తి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, అదనపు జాయింట్ కలెక్టర్ సి.హెచ్.పెంచలరెడ్డి

## అంతర్జాతీయ సదస్సుకు ఛైర్మన్‌గా డా॥ జగదీష్



నెల్లూరు గర్వించదగ్గ వైజ్ఞానికులు డా॥ జగదీష్ ఆస్ట్రేలియా దేశంలోని బ్రిస్బేన్‌లో సెప్టెంబర్ 16, 17, 18తేదీలలో జరిగే "అంతర్జాతీయ బయోఎనర్జీ, బయో ఫ్యూయల్ అండ్ వెయిర్ ఇంపాక్ట్ ఆన్ ది గ్లోబల్ ఎకానమీ" ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, అప్రాప్రియేట్ టెక్నాలజీలలో విశేషకృషి చేసిన డా॥జగదీష్ ఇప్పటికీ 30దేశాలలో జరిగిన అంతర్జాతీయ వైజ్ఞానిక సదస్సులలో పాల్గొని తన పరిశోధనలను సమర్పించి వున్నారు. ప్రతిష్ఠాత్మక మార్గరెట్ నోబుల్ ఫౌండేషన్, సీటెర్, అమెరికా అవార్డు మరో 15జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకొని వున్నారు. ప్రపంచంలోనే ప్రాచీనమైన వైజ్ఞానిక పత్రిక "నేచర్"లో ఆయన పరిశోధనా పత్రం ప్రచురితమై వుంది. అంతేకాక అభివృద్ధి చెందుతున్న పలుదేశాలలోని ప్రత్యామ్నాయ ఇంధన వనరుల సంస్థలకు సలహాదారుడుగా సేవలు అందిస్తున్నారు. అటువంటి ప్రతిభామూర్తికి ఈ సందర్భంగా 'లాయర్' ప్రత్యేక అభినందనలు.

## జగజ్జీవన్‌రామ్‌కు వైయస్సార్‌సీపీ నివాళి



జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైకాపా నాయకులు మందా బాబ్జీ తదితరులు

నెల్లూరు వేదాయపాళెం సెంటర్‌లో ఈనెల 5న డా॥బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన జయంతిని పురస్కరించుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి గౌరవంగా నివాళులు అర్పించారు. దళితుల ఆశాకిరణం, మాజీ భారత ఉప ప్రధాని అయిన బాబు జగజ్జీవన్‌రామ్ చేసిన సేవలను వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, స్టీరింగ్ కమిటీసభ్యులు మందా బాబ్జీ, నరసయ్య, నాయకులు భీమినేని మురహరి, ఎన్.రాజగోపాల్‌రెడ్డి, కుమార్, చంద్రమౌళిలు కొనియాడారు. కార్యకర్తలు నివాళులర్పిస్తూ "జోహార్ బాబుజగజ్జీవన్‌రామ్" అని చేసిన నినాదాలు అంబరాన్నంటాయి.

## వైద్య సేవలో నెల్లూరు డాక్టర్లు భేష్

వైద్య వృత్తిలో ప్రజలకు ఉత్తమమైన వైద్యసేవలందించిన జిల్లాకు చెందిన ఇరువురు డాక్టర్లకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని వైద్య విద్య సంచాలకుల కార్యాలయ సమావేశ మందిరంలో సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో విశిష్ట సేవలందించిన నెల్లూరు డియస్ఆర్ ప్రభుత్వ వైద్యశాల (పెద్దాసుపత్రి)లో ఎముకలు, కీళ్ళు వైద్య నిపుణులుగా సేవలందిస్తున్న డా॥ ఎ. పెంచలయ్యను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉత్తమ సేవలందించిన నెల్లూరుజిల్లా మైపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డా॥కె.వెంకటేశ్వర్లును రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డా॥అజయ్‌సహాని, కుటుంబ సంక్షేమ కమీషనర్ పూనం మాలకొండయ్య, వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకులు డా॥అరుణకుమారి పాల్గొన్నారు.

హర్షం– నెల్లూరుజిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో ఉత్తమ వైద్యులుగా అవార్డులను అందుకున్న డా॥ఎ.పెంచలయ్యను, డా॥కె.వెంకటేశ్వర్లును పెద్దాసుపత్రి సూపరిండెంట్ డా॥సుబ్బారావు, ఆర్ఎంఓ డా॥ఉషాసుందరి, డా॥రవీంద్రనాథ్‌ఠాగూర్, డా॥షేక్ మస్తాన్‌బాషా, డా॥కిరణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

## 'క్యాప్'కు కిరణ్ మామ విరాళం



'క్యాప్' చిన్నారులకు మిఠాయిలందజేస్తున్న కె.వి.రమణారెడ్డి, ఎస్పీ బి.వి.రమణకుమార్

పేరెన్నికగన్న ఆర్ఆర్ హోటల్స్ అధినేత కరవళ్ల వెంకటరమణారెడ్డి ఛైల్డ్ అండ్ పోలీస్ ప్రాజెక్ట్(క్యాప్)కు రూ.3లక్షల విరాళాన్ని ప్రకటించారు. మంగళవారం కొండాయపాళెం గేటువద్ద వున్న క్యాప్‌ను వెంకటరమణారెడ్డి సందర్శించారు. చిన్నారులతో కొద్దిసేపు గడిపిన ఆయన మాట్లాడుతూ సమాజానికి దూరంగా వున్న చిన్నారులను చేరదీసి వాళ్ళ భవితకు బంగారుబాటలు వేస్తున్న జిల్లా పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. క్యాప్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. విరాళం చెక్కును జిల్లా ఎస్పీకి అందజేశారు. చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ ఎల్‌టి చంద్రశేఖర్, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## రత్నం విద్యార్థుల ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు

ఇటీవల దక్షిణ భారత స్థాయిలో జరిగిన ఒలంపియాడ్ ప్రతిభా పరీక్ష పోటీల్లో నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం ఒలంపియాడ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ ప్రతిభా పరీక్ష పోటీల్లో సియో మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో 6వ తరగతి విద్యార్థి ఎ.ప్రవీణ్‌రెడ్డి, 8వతరగతి విద్యార్థి డి.సాహితీ, సికో కెమిస్ట్రీ ఒలంపియాడ్‌లో 10వ తరగతి విద్యార్థి బి.బాలసుదీప్ ప్రతిభను కనబరిచారు. సోమవారం సంస్థ డైరెక్టర్స్ డా॥కృష్ణకిషోర్స్, వాసంతి కృష్ణకిషోర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిఎం రామ్మూర్తినాయుడు, కెవిడి మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శివకుమార్, ఏఓ రుక్మిణి పాల్గొన్నారు.

## వై.యస్.పై సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న మైసూరారెడ్డి

నెల్లూరుజిల్లాకు చెందిన ఎన్ఎండి ఛారిటీస్ ఛైర్మన్ సయ్యద్ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో "మరలాపుట్టవా రాజశేఖరా మా కోసం" అనే పేరుతో రూపొందించిన సిడిని వైయస్సార్ సిపి కేంద్రపాలక మండలి సభ్యులు ఎంపీ మైసూరారెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సీడీలో 7పాటలను పొందుపరిచారు.

## బావిలో పడిన ఆవు సురక్షితం

నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధి, బొందిలి సందులో మంగళవారం మధ్యాహ్నం బావిపైన వున్న పిచ్చి మొక్కలను తినేందుకు ఆవు బావిపై ఎక్కి మొక్కలను తినేందుకు ప్రయత్నిస్తుండగా బావిపైన వేసి వున్న పాతరేకులు ఒక్కసారిగా విరిగిపోవడంతో రేకులతో పాటు ఆవు కూడా బావిలో పడింది. దీంతో పెద్దశబ్దం రావడంతో సమీపంలో ఆడుకుంటున్న పిల్లలు చూసి పెద్దలకు చెప్పడంతో స్థానికులు వెంటనే బావి వద్దకు చేరుకుని అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారమందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపకదళ సిబ్బంది స్థానికుల సహాయంతో బావిలోకి దిగి తాళ్ళతో ఆవును కట్టి పైకి లాగడంతో ఆవు సురక్షితంగా బయటపడింది.

## హరివిల్లు ఉగాది పురస్కారాలు



జలదంకి ప్రభాకర్‌కు హరివిల్లు ఉగాది పురస్కారం

హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో విజయనామ సంవత్సర ఉగాది పురస్కారాలను నెల్లూరులోని ఒక హోటల్‌లో సోమవారం రాత్రి నిర్వహించారు. అంతర్జాతీయ శాస్త్రవేత్త డా॥ ఎ.జగదీష్, నది మాసపత్రిక ఎడిటర్ జలదంకి ప్రభాకర్, సాక్షి దినపత్రిక ఫీచర్స్ ప్రతినిధి వాకా మంజులారెడ్డి, ఎంఎస్ఆర్ ఓల్డేజ్ హోం నిర్వాహకులు డా॥ మల్లె శ్రీనివాసరావు, టీవీ1 సీనియర్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సర్వేపల్లి సురేష్, నృత్యకళాకారిణి సురభి గాయత్రి, చిత్రకారులు అమీర్‌జాన్, సూక్ష్మ కళా కృతుల సృష్టికర్త గంధవళ్ళ ఉమాశంకర్, కవి ఏటూరి నాగేంద్రరావు, రంగస్థల నటి చంద్రసేన, వాస్తు పండితుడు వాస్తు రామచంద్ర, హరికథా భాగవతారిణి ఎస్.వసంతకుమారి ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ గురుకృప కళాక్షేత్రం విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్యం, జానపద నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొన్నారు. హరివిల్లు క్రియేషన్స్ అధినేత దొర్నాల హరిబాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.



ఈ నెల 6వ తేదీన నెల్లూరు ఆదిత్యనగర్‌లో 10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్‌రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి

# చదువు, ఆటలు విద్యార్థులకు రెండు కళ్లు

## ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి, ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని, క్రీడలు మానసికోల్లాసంతో పాటు శరీర దారుఢ్యానికి దోహదపడుతాయని ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు కొండాయపాళెం సమీపంలో ఉన్న జనహిత–వాత్సల్య ఆధ్వర్యంలో నడుస్తున్న భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో నిర్వహించిన క్రీడోత్సవాలను ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారతక్రీడాకారులు రాణించాలంటే క్రీడలు, క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం అవసరమన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యతను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య గౌరవాధ్యక్షుడు సామంతు గోపాల్‌రెడ్డి, శబరి శ్రీరామక్షేత్రం కమిటీ అధ్యక్షుడు బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి ఆదిశేషారెడ్డి సంఘటన కార్యదర్శి జివి సాంబశివరావు, సహాయ కార్యదర్శి టివియస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ ఛార్జీలపై పార్టీల లాఠీఛార్జ్

సింహపురి సమాచారం

- విజయవంతమైన బంద్
- రాస్తారోకోలు, ఆందోళనలతో గళమెత్తిన విపక్షాలు



వైయస్ఆర్‌సీపీ నాయకుల ప్రదర్శన



బంద్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు



నిర్మానుష్యంగా నెల్లూరు ట్రంకురోడ్డు

విద్యుత్‌ఛార్జీల పెంపు, సర్‌ఛార్జీలు తదితర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రతిపక్షపార్టీలు మంగళవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించారు. ఉదయాన్నే వివిధ పార్టీలకు చెందిన ఆందోళనకారులు వీధుల్లో పలురకాలుగా నిరసనలు వ్యక్తం చేసారు. ఆర్టీసీబస్సులు డిపోల్లోంచి కదలలేదు. జాతీయ రహదారిపై రాస్తారోకోలు నిర్వహించారు. దీంతో జాతీయ రహదారి మీద వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు మూసివేసారు. హోటళ్ళు, సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, వ్యాపారసంస్థలు స్వచ్ఛందంగా మూసివేసారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులను ఆందోళనకారులు మూయించారు. జిల్లాలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ముందస్తు చర్యగా అరెస్టులు, బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

తెలుగుదేశంపార్టీ, సిపిఎం, బిజెపి, వైకాపా, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనలు, స్కూటర్‌ర్యాలీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు తిరిగాయి. చాలాచోట్ల రాజకీయపార్టీలు వేర్వేరుగా ప్రదర్శనలు నిర్వహించాయి. జిల్లాలో 184మంది సిపియం కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి, పూచీకత్తుపై విడుదల చేశారు. 84మంది సిపిఐ కార్యకర్తలు, 180మంది టిడిపి కార్యకర్తలు, 80మంది వైయస్సార్‌సిపి కార్యకర్తలు, 87మంది బిజెపి కార్యకర్తలను అరెస్టులు చేసి వదిలేసారు. బంద్ సందర్భంగా అరెస్టయిన వారిలో సిపియం పార్టీ మాజీఎంపి మధు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు. వీరిని సొంత పూచికత్తుమీద వదిలేసారు. ప్రతిపక్షాలు చేపట్టిన బంద్ విజయవంతమైంది.

# విద్యుత్‌భారం 30వేల కోట్లు

## టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి



సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టానుసారంగా సర్‌ఛార్జీలు, విద్యుత్‌ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.30వేల కోట్ల భారాన్ని మోపిందని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. విద్యుత్‌ఛార్జీల పెంపుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు వేదాయపాలెంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌ఛార్జీల పెంపుకు నిరసనగా తెలుగుదేశంపార్టీ నిర్వహిస్తున్న ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. 200లోపు యూనిట్లు మాత్రం యథావిధిగా వసూలు చేయాలనడం ఎంతవరకు సమంజసమన్నారు. విద్యుత్ కోతలతో వ్యవసాయం పూర్తిగా కుంటుపడిందని, రాష్ట్రంలో 25వేల పరిశ్రమలకుపైగా మూతపడ్డాయన్నారు. దీంతో దాదాపు 2లక్షల మంది కార్మికులు బతుకుదెరువు కోల్పోయి బజారునపడ్డారన్నారు. విద్యుత్‌ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ పార్టీలకతీతంగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. విద్యుత్‌ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా సేకరించిన సంతకాలను రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిలారి వెంకటస్వామినాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బాలకృష్ణ చౌదరి, అన్నం దయాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో గురువుకు అరుదైన గౌరవం



శ్రీసిటీకి తమిళనాడు భారతి దాసన్ యూనివర్శిటీ మొదటి వైస్‌ఛాన్సలర్, తమిళనాడు తిరుచ్చిలోని రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తొలి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పిఎస్ మణిసుందరం 6వ తేదీ వచ్చారు. శ్రీసిటీ ఎండి రవి సన్నారెడ్డికి ఈయన గురువు. శ్రీసిటీ ప్రగతిని చూసి రవిసన్నారెడ్డిని పిఎస్ మణి అభినందించారు. 86ఏళ్ళ వయస్సులోనూ హుషారుగా శ్రీసిటీలోని ముఖ్యమైన ప్రాంతాలను మణిసుందరం సందర్శించారు. ఎంతోమందికి అన్నంపెట్టే శ్రీసిటీలోని పరిశ్రమలను చూసి, శిష్యుడు రవిసన్నారెడ్డిని ప్రేమపూర్వకంగా పిఎస్‌మణి ఆలింగనం చేసుకుని అభినందించారు.

# ముక్తిధామం కాదిది.. స్వర్గమార్గం



రుద్రభూమి ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ బి.శ్రీధర్, ఎస్పీ బి.వి.రమణకుమార్, దాత కె.వి.రమణారెడ్డి, కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు

నెల్లూరుజిల్లా అల్లూరులో దుర్భరంగా వున్న శ్మశానాన్ని ముక్తిధామంగా మార్చాలన్న సంకల్పంతో ఆర్ఆర్ హోటల్స్ అధినేత కరవళ్ల వెంకటరమణారెడ్డి చేసిన కృషి ఎనలేనిది. ఆదివారం అల్లూరులో ఏర్పాటుచేసిన రుద్రభూమి ముక్తిధామంను జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముక్తిధామం కోసం వెంకటరమణారెడ్డి ప్రభుత్వ సహకారాన్ని కోరినప్పుడు అంగీకరించి సహకారాన్ని అందించానన్నారు. తన ఊరుకు సేవచేయాలనే తలంపు వున్న వెంకటరమణారెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జీవించి ఉన్నపుడు మనకోసం ఎంతో చేసిన కుటుంబ పెద్దలకు అదే గౌరవభావం, మంచి పరిస్థితుల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించినపుడే సార్థకత వుంటుందన్నారు. దివంగతులైన పెద్దలను మనం దైవంగా భావిస్తామని, పితృదేవతలను ప్రార్థించే సంప్రదాయం ఉన్నప్పటికీ వారి చివరి మజిలీ శ్మశానాల్లో అందుకు తగిన అవకాశాలు లేకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వయాన మామ, ఈ కార్యక్రమ దాత కరవళ్ల రమణారెడ్డి మాట్లాడుతూ తన స్వంత గ్రామానికి సేవచేయాలన్న ఉద్దేశ్యంతోనే అల్లూరులోని శ్మశాన వాటికను ముక్తిధామంగా మార్చానన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఈ ఉన్నతమైన కార్యాన్ని చేపట్టానన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్‌కె కోసా సంస్థ, స్థానికుల సహకారంతో ఈ మహత్తరకార్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే బీదమస్తాన్‌రావు, ఆర్‌కెజేసి కరస్పాండెంట్ బ్లూఫాక్స్ మినర్వా అధినేత అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి, మేదా అశోక్‌కుమార్‌రెడ్డి ఆర్‌కెకోసా కార్యదర్శి పుచ్చలపల్లి మదన్‌మోహన్‌రెడ్డి, ఆళ్ల సుధాకర్‌రెడ్డి, మేదా విజయకుమార్‌రెడ్డి, కావలి ఆర్డీఓ సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## కదంబం

### తెలుగు సంస్కృతిపై
# ఉగాది కవితా వాణి

కోట సుబ్రహ్మణ్యశాస్త్రి
నెల్లూరు. 94403 55644.

తెలుగువత్సర శోభ-తొంగి చూచె!
నవ్యశోభతోడ-దివ్య వెలుగులనంది
క్రొత్తవత్సర కాంత-చిత్తమెరిగి
ప్రజాసమూహాన్ని-ప్రమోదమందించ
వెలుగుజూపవచ్చె-వేల్పుఅగుచు!

❖❖❖❖❖

"కుహు కుహు" నాదాల-కోయిల కూసింది
మధురగానము తోడ-మేళవించి
చిగురుటాకుల మధ్య-చైతన్య మందించె
మధురానుభూతుల-ముచ్చటంది!

❖❖❖❖❖

విజయవత్సరంబు-వెలుగులు జిమ్ముచు
నవ్యత చేకూర్చె-నిన్నగోరి
వత్సరకాంతగ-వేడుకలందించ
ప్రేమమూర్తి అయ్యె-పరవశమున!

❖❖❖❖❖

నూత్నవత్సరంబు - నవయువకాంతగా
వధువు వల్లెవచ్చి - వరములివ్వ
సౌందర్యశోభతో - సౌహార్ధచిత్తంతో
కాలచక్రము త్రిప్పె-క్రాంతి నింపి!

❖❖❖❖❖

తల్లి అభయమిస్తె - తలరాతలే మారు
పడగెత్తి కోట్లకు - పరుగులెత్తు
బండ్లు ఓడలగుచు - భాగ్యోన్నతినంది
పచ్చని బ్రతుకుల - మెచ్చగలరె!

❖❖❖❖❖

పసుపు కుంకుమతోటి-పచ్చని కాంతుల
స్త్రీ మూర్తులందరు-సేవచేసి
భోగభాగ్యాలతో-బంగారు భవితను
కోర్కెల వర్షంగ-కోరరండి!

❖❖❖❖❖

వగరు, పులుపు, తీపి-వివరించనున్నాయి
కష్టసుఖాలను-కూర్చిపేర్చి
విజయవత్సరకాంత-విజయములందించి
సుఖదు:ఖాలతో-స్నేహమందు!

❖❖❖❖❖

సుఖము కల్గినపుడు-సంబరపడనేల!
కష్టము కల్గిన-కృంగనేల!
ఉగాది చెట్నీలో-ఉన్నట్టి రుచులల్లె
సాగించి నీ భవిత-సంతసించు!

❖❖❖❖❖

బంధువులందరు-విందుచేయగ రండి
అనురాగము పంచి-ఆత్మదలచి
రక్తసంబంధముతో-శక్తినిగాంచండి
క్రొత్తవత్సర కాంత-కోర్కెలంది!!!

## 13న "పాహిరామప్రభో" సంగీతకచ్చేరి

ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీమతి జె.బాలార్క శిష్య బృందంచే శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 13వ తేదీ శనివారం సాయంత్రం 6.30గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో "పాహిరామప్రభో" సంగీత కచ్చేరి వీనుల విందుగా జరుగుతుందని, సంగీతప్రియులు, నగర ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు.

# ఆంధ్రాలో ఎన్టీఆర్, వైయస్సార్ పర్యటన

### శ్రీను గల్పిక

అది స్వర్గలోకం. ఇంద్రుడు ఆరోజుటి కేసుల వివరాలను తన ల్యాప్‌టాప్‌లో పరిశీలిస్తున్నాడు. అప్పుడే ఆయనకు ఓ ఈ-మెయిల్ వచ్చింది. ఏంటబ్బా అని దానిని ఓపెన్ చేసాడు. అది యమహాడాట్‌కామ్ నుండి వచ్చిన మెయిల్. యమధర్మరాజు పంపించాడు. భూలోకంలో పాపులు పెరిగినందున. వారందర్నీ యమ లోకానికే తీసుకురావాల్సి వస్తుంది. పాపులు ఎక్కువగా వస్తుండడంతో యమలోకం నిండి పోయింది. కొత్తగా వచ్చే పాపులకు ఇవ్వడానికి క్వార్టర్స్ ఖాళీలేవు. వచ్చినవాళ్ళను శిక్షించడానికి తగినంత మంది యమభటులు లేరు. యమ లోకంలో భటుల సంఖ్యను పెంచాలని అధి ష్ఠానానికి(కైలాసం) ప్రతిపాదనలు పంపివున్నాం. అక్కడ నుండి అనుమతి వచ్చే వరకు కొంతమంది పాపులను మీ లోకానికి పంపిస్తాము. ఎలాగూ పుణ్యాత్ములు లేక మీ స్వర్గలోకం ఖాళీగానే వుంటుంది. మీకూ ఏం పని వుండివుండదు. కాబట్టి మా విజ్ఞప్తిని మన్నించగలరు.

ఇట్లు
యమధర్మరాజు, ఎంఏ

అని మెయిల్ పెట్టాడు. ఇది చదివి దేవేంద్రుడికి తిక్కరేగింది. పనిలేక ఎంత ఖాళీగా వుంటేమాత్రం ఇంతగా నొక్కి రాయాల్నా అని మనసులో అనుకుంటూ. ఇప్పుడేం చేయాలబ్బా అని మదన పడసాగాడు. అప్పుడే అక్కడకు నందమూరి తారక రామారావు, వై.యస్.రాజ శేఖరరెడ్డిలు వచ్చారు. దిగులుగా వున్న ఇంద్రు డిని చూసి... ఏమైంది సార్ అని వాళ్ళు అడిగారు. యమలోకం నుండి వచ్చిన మెయిల్ గురించి ఇంద్రుడు చెప్పి... నాకు పనిలేదని ఆ యముడు పరోక్షంగా హేళన చేస్తున్నాడని వాపోయాడు ఇంద్రుడు. అప్పుడు రామారావు అందుకుని... పని అనేది దానంతట అది రాదు సార్, మనంతట మనమే కల్పించుకోవాలి. మేమిద్దరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా వున్నప్పుడు చేసిందదే. ప్రజల వద్దకు పాలన అని పనిలేనప్పుడంతా స్వర్గలోకం కలతిరుగు... ఈ లోకంలో వున్న ప్రజల నుండి అర్జీలు స్వీకరించు. రెండు రూపాయలకే కిలోబియ్యం పథకం పెట్టు అని చెప్పాడు. వెంటనే వై.యస్. అందుకుని... ఇందిరమ్మ పల్లెపథం లాగా ఇంద్రుడి పల్లెపథం పెట్టుకో. ఇళ్లిళ్లూ తిరుగూ... రచ్చబండ కార్యక్రమం పెట్టుకుని రచ్చరచ్చ చేసేయ్. దేవలోకపు మీడియా మిమ్మల్ని బాగా ఫోకస్ చేస్తుంది. మీరు క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నారనే ప్రచారం వస్తుంది. అప్పుడు యమధర్మరాజు లాంటి వాళ్ళు మిమ్మల్ని ఏమీ అనలేరని చెప్పాడు. వారికి ఇంద్రుడు థ్యాంక్స్ చెప్పి... ఏమన్నా పని మీద వచ్చారా అని ప్రశ్నించాడు. వై.యస్. వుండి... మా రాష్ట్రంలో ప్రజలు, ముఖ్యంగా మా పార్టీల వాళ్ళు మా గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలని వుంది. ముఖ్యంగా ఎన్టీఆర్ గారు చాలా తపనపడుతున్నారు. ఆయనకు తోడుగా నేనూ అలా వెళ్లాను, ప్రజలు ఎలావున్నారో చూసి వస్తాను, దీనికి మీ అనుమతి కావాలన్నాడు. ఇంద్రుడు వాళ్ళకు రెండురోజులు సెలవు మంజూరు చేసాడు.

★★★★★

సెలవు మీద ఎన్టీఆర్, వై.యస్.లిద్దరూ భూలోకానికి చేరుకున్నారు. వై.యస్.కు పల్లెటూర్లంటే ఇష్టం కావడంతో ముందుగా రంగారెడ్డిజిల్లా తాండూరు మండలంలో వున్న ఓ గ్రామానికి వెళ్ళారు. తమను గుర్తుపట్టకుండా ఎన్టీఆర్, వైయస్‌లు మారువేషం వేసుకున్నారు. ఆ గ్రామంలో అటుగా వెళుతున్న ఓ రైతును వై.యస్. ఆపి... బాబూ... ఈ ప్రభుత్వం మీకు ఉచితంగా కరెంట్ ఇస్తుందా అని అడిగాడు. దానికా రైతు... కరెంట్ ఉచితమేనయ్యా... కాని కరెంటే లేదు. ఉచితమైతేనేం, డబ్బు కట్టించు కుంటేనేం అంటూ వెళ్ళిపోయాడు. ఆ మాట విని వై.యస్.కు బాధేసింది. అంతలో మరో రైతు చేతిలో పొలం కాగితాలను పెట్టుకుని వెళుతున్నాడు. వై.యస్. అతనిని ఆపి ఎక్కడకు వెళుతున్నావని అడిగాడు. దానికతను... కరెంట్ బిల్లు వచ్చింది. దానిని కట్టాలంటే వున్న ఎకరం పొలం అమ్మకతప్పదు. వున్న పొలం అమ్మేసి కరెంట్ బిల్లు కట్టడానికి రిజిస్ట్రార్ ఆఫీసుకు పోతున్నానని చెప్పాడు. అంతలో దూరంగా ఏడుపులు పెడబొబ్బలు వినిపించాయి. వై.యస్. అటుకేసి చూసాడు. కొందరు ఒక వ్యక్తిని మంచం మీద పడుకోబెట్టుకుని వస్తున్నారు. వై.యస్. ఒకరిని ఆపి... ఏమైందని అడిగాడు. దాని కతను... అతనికి గుండెపోటు వచ్చింది. ఆసుపత్రికి తీసుకెళ్తున్నామని చెప్పాడు. వై.యస్.కు ఆశ్చర్యమేసింది. వెంటనే అతనితో 108అంబులెన్స్‌కు ఫోన్ చేయొచ్చుకదా అని అడిగాడు. దానికతను... ఆ పని చేసాం. 108 అంబులెన్స్‌లలో డీజిల్ లేదట... మమ్మల్నే వచ్చి డీజిల్ పోసుకుని అంబులెన్స్‌ను తీసుకుపొమ్మ న్నారు. మాకు అంత టైం ఎక్కడుంది. అందుకే ఈ తిప్పలు అని చెప్పాడు. వై.యస్.కు అది విని బాగా బాధేసింది. నా ప్రజలు పడుతున్న కష్టాలు చూడడానికేనా... నేను సెలవు పెట్టి మరీ వచ్చిందని ఎన్టీఆర్‌ను పట్టుకుని ఏడవసాగాడు. ఎన్టీఆర్ ఆయనను సముదాయించి... ఇక్కడ ఎక్కువ సేపు వుంటే నీ మనసు పాడైపోతుంది... అలా గుడివాడ వెళ్దాం... కొంచెం ప్రశాంతంగా వుంటుందని చెప్పి తీసుకుపోయాడు. అక్కడ రోడ్డు మీద ఎక్కడ చూసినా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఫ్లెక్సీలే! వాటిని చూసి ఎన్టీఆర్, వై.యస్‌లిద్దరూ ఆశ్చర్యపోయారు. కారణం ఆ ఫ్లెక్సీల మీద వై.యస్. ఫోటోతో పాటు ఎన్టీఆర్ బొమ్మ కూడా వుండడం. వై.యస్. వుండి... అదేంటి అన్న గారు... మా కొడుకు పెట్టిన పార్టీ ఫ్లెక్సీలో విచిత్రంగా మీ ఫోటో వుందేంటని అడిగాడు. దానికి ఎన్టీఆర్... విధిరాత అంటే ఇదే వై.యస్. గారు... నేను తెలుగుదేశంపార్టీని పెట్టాను. నేను బ్రతికున్నప్పుడే నన్ను ఆ పార్టీ నుండి గెంటేసారు. ఇక నువ్వంటావా... ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బ్రతికించింది మీరే... కాని మీరు చనిపోయాక మీ కాంగ్రెస్‌వాళ్ళు మీ ఫోటోను బయటేసారు. వాళ్ళకు మన అవసరం తీరిపోయింది. కాబట్టి వాళ్ళ ఫ్లెక్సీలలో మనం కనిపించం. వైయస్సార్ కాంగ్రెస్‌తో నీకు, నాకు సంబంధం లేకపోయినా మన ఇద్దరిఫోటోలు ఆ పార్టీ ఫ్లెక్సీలలో ప్రత్యక్ష మవుతున్నాయి. ఇకముందు మన బొమ్మల్ని ఎన్ని పార్టీలవాళ్ళు వాడుకుంటారో... ఆంధ్రాకు వస్తే ఇలాంటి ఘోరాలు ఎన్ని చూడాల్సి వస్తుందో. ఇక రాకూడదు పద అని ఎన్టీఆర్ వై.యస్.ను తోడ్కొని తిరుగుపయనమయ్యాడు.

★★★★★

# విజయ ఉగాది

కె.వి.నాగేశ్వరరావు
కోవూరు, 99636 62699

చైత్రాలెన్నో వచ్చిపోతూనే ఉన్నాయి
కేన్వాస్‌పై రంగులు ఒలికినట్లు
వసంత చిత్రాలను గీస్తూనే ఉన్నాయి
ఆరు ఋతువుల ఆమని అరుదెంచే వేళ
ఉగాది వస్తుందని ఎదురు చూస్తున్నాను
ఎన్ని వసంతాలు ఎదురుచూసినా
ఏ ఒక్క తీపి గుర్తూ మిగలడంలేదు
కిందటి సంవత్సరం ఇంటి ముందు
మహావృక్షంలా పెరిగిన వేపచెట్టుపై
కోకిలమ్మ గొంతెత్తి పాడుతుంటే
అపుడే ఉగాది వచ్చిందని ఆశపడ్డాను
వలస వెళ్ళిన కోకిలమ్మ ఈ వసంతంతో తిరిగివచ్చి
ఊయల ఊగుదామంటే ఆ వేపచెట్టు అక్కడ కనుపించలేదు
ఆ స్థానంలో కొత్త బిల్డింగ్ నిటారుగా లేచి నిలబడింది
కోపం వచ్చి అలిగి వెళ్ళిపోయింది కోకిలమ్మ
తనువంతా తీయటి బంధాలతో పెనవేసుకొన్న
తరులన్నీ రాలిపోతున్న ఆకుల్ని చూసి బాధపడటంలేదు
రేపటి చిగుళ్ళతో మోడుబారిన తన జీవితం
మళ్ళీ పచ్చగ కళకళలాడుతుందని నిరీక్షిస్తున్నది
ఎక్కడ చూసినా ఎన్నికల ఉపన్యాసాలేగాని
కవితాగోష్ఠులు కానరాక సాహితీ వేదికలు
వెలవెలబోతున్నాయి.
కలర్‌టీవీల మీడియా ప్రభావంతో
కనుమరుగైపోతున్నది కోకిల కంఠమాధుర్యం
హలో, లవ్ ఇన్‌సెల్, అనే ఈరోజుల్లో
ఉగాదికి ఆహ్వానాలని ఉత్తరాలు కూడా అందుకోలేని
నేస్తాలు బంధుప్రియులంతా ఉగాది స్పెషల్ ఏమిటంటే
తెలుగువాడి నోటి వెంట పలికే ఉగాది పచ్చడి
షడ్రుచులన్నీ ఆరగించి, వగరు, చేదులాంటి బాధల్ని దాచుకొని
తేనెవంటి మధురమైన తియ్యటి పలుకులతో
మంచితనాన్ని పంచిపెట్టి మానవత్వాన్ని పొందిన రోజు
నిజమైన ఉగాదులు వస్తూనే ఉంటాయి
ఉగాది వచ్చిందంటే వేపచెట్టు విరగపూయాలి
గున్నమామి గుబుర్లలో కోకిలమ్మ ఊయల లూగుతూ
గొంతెత్తి కమ్మగా పాడుతుంటే మనసు పులకించిపోవాలి
ఋతువులన్నీ ఏకమై వసంతానికి పట్టంగడుతుంటే
చైత్ర సుందరి సిరిమల్లెలతో సింగారించుకొని
నిత్యనూతన వసంతమై తొలకరిజల్లుగా
యుగయుగాల ఉగాదికి స్వాగతం సుస్వాగతం

PDF Compressor Free Version



### మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

పెట్టుబడులు, డిపాజిట్ చేయడం వంటి పనులు జరుగుతాయి. పనులు అనుకూలంగా జరిగినా, పదే పదే టెన్షన్ పడుతుంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో కొత్త ప్రణాళికలో ముందుకు సాగుతారు. ఆదాయం పెరుగుతుంది. చేస్తున్న కాంట్రాక్టులు, ఏజెన్సీలు ఇంకా కొంత కాలం పొడిగింపబడే అవకాశం ఉన్నది.

### వృషభం
కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఆర్థికపరంగా పెట్టుబడులకై ఆహ్వానాలు అందుతాయి. దూరప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆర్థికముగా బాగుండి ఆదాయం బాగుంటుంది. వృత్తి ఉద్యోగ ఉపాధి అవకాశాలలో రాణిస్తారు. పబ్లిక్‌లో పలుకుబడి గౌరవం బాగుండి అనుకున్న పనులు జరిగిపోతాయి. గృహవస్తు వాహన రిపేర్లు జరుపుతారు. విద్యాప్రగతి బాగుంటుంది.

### మిథునం
మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబంలో చిన్న విభేదాలుంటాయి. కాబట్టీ సర్దుబాటు చేసుకొనడం మంచిది. షేర్లు స్థిరాస్తుల మీద రాబడి ఉంటుంది. ఉద్యోగులకు అదనపు విధులు, స్థానచలనము, అధికారులతో మైత్రి బాగుంటుంది. లౌకికమైన నిర్ణయాలైనా, ఆర్థికపరమైన నిర్ణయాలైనా తొందరపడి చేయకండి. వృత్తి నిర్వహణలో సంతృప్తి, వ్యాపార రంగాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది.

### కర్కాటకం
పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఇతర పనులు అనుకున్నట్లుగానే జరుగుతుంటాయి. ఇంజనీరింగ్, శాస్త్ర రంగాల వారికి కొత్త ప్రాజెక్టులు దొరకవచ్చును. కుటుంబసౌఖ్యము, బంధువులతో సామరస్యంగా బాగుంటుంది. వ్యాపార విస్తరణకు అభివృద్ధికి కష్టపడతారు. కాని ఫలితం ఆశించినంతగా ఉండదు. ఇంట్లో, బంధువర్గంలో అనారోగ్య బాధితులుండుట చేత ఆందోళనగా ఉంటుంది.

### సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులకు అధికార వర్గానికి పనిభారం, ప్రభుత్వ వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారు చిత్తశుద్ధి ప్రదర్శించండి. కొత్త పథకాలతో వ్యాపార విస్తరణ, నూతన పెట్టుబడులు పొందుతారు. స్థిరాస్తుల వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకొనకుండా జాగ్రత్తపడాలి. ఆదాయం బాగుంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. షేర్లు లాభిస్తాయి.

### కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ముఖ్య వ్యక్తుల కొరకు ఎదురు చూడటం, సత్కార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్తపడండి. ఉద్యోగులు అధికారులు ప్రలోభాలకు దూరంగా ఉండండి. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చు. గృహ, వస్తు, వాహన రిపేర్ల ఖర్చులు అదనంగా ఉంటాయి. అనుకున్న పనులు హడావుడిగా పూర్తిచేయడం, అనవసర ఖర్చులు పైనబడటం జరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 12.4.2013 నుండి
తేది. 18.4.2013 వరకు

ఈవారము మీనంలో బుధుడు, మేషంలో రవి కుజశుక్రకేతువులు, వృషభంలో గురువు, మేషవృషభమిథున కర్కాటకరాశులలో చంద్రుడు తులలో రాహుశనులు సంచరిస్తారు.

**పంచాంగము :**

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

ముహూర్తములు లేవు.

**చైత్రమాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | విదియ | సా॥ గం.4.07వ॥ |
| తేది. 13 | శని | తదియ | సా॥ గం.5.39వ॥ |
| తేది. 14 | ఆది | చతుర్థి | రా॥ గం.7.24వ॥ |
| తేది. 15 | సోమ | పంచమి | రా॥ గం.9.26వ॥ |
| తేది. 16 | మంగళ | షష్ఠి | రా॥ గం. 11.32వ॥ |
| తేది. 17 | బుధ | సప్తమి | రా॥ గం. 1.30వ॥ |
| తేది. 18 | గురు | అష్టమి | రా॥ గం. 3.20వ॥ |

### తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబ వ్యవహారాల విషయంలో పట్టుదలకు పోయి రచ్చచేసి కొనవద్దు. ఆర్థికావకాశాలు బాగుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్‌గా ఉంటుంది. ఋణాలు, హామీల విషయంలో మొగమాటాలకు పోకండి. వృత్తి పరంగా అభివృద్ధి పలుకుబడి బాగుంటుంది. వ్యాపారవృద్ధికి పెట్టుబడులకు ఋణాలు చేస్తారు. ఆర్థికస్థితికి ఇబ్బంది ఉండదు.

### వృశ్చికం
విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు అధికారుల సహకారము, విధి నిర్వహణ సామర్థ్యం బాగుంటుంది. నిర్మాణకలు, స్థిరాస్తులు కొనడానికి ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరికి, ఆర్థికస్థితి వృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది. మీ మాటకు విలువ గుర్తింపు పొందు తారు. ఉద్యోగ ప్రయత్నాలలో మంచి అవకాశాలు దొరక వచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శారీరక మానసిక శ్రమ వల్ల ఆరోగ్యం లోపించవచ్చును. ఉద్యోగాలలో మార్పులుండవచ్చును. చేసే పనులందు ఆటంకాలను అధిగమిస్తారు. ఆర్థికాభివృద్ధికి ప్రయత్నాలు ఫలించగలవు. కొత్త కాంట్రాక్టులు, వ్యాపార భాగస్వామ్య అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా వృద్ధి చెందుతారు. కోర్టు కేసులందు అనుకూలత, బాకీల వసూలుపై వత్తిడి పెంచడం జరుగుతుంది.

### మకరం
ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

క్రొత్త కాంట్రాక్టులకు, క్రొత్త పెట్టుబడులకు అనుకూలత అవకాశాలుంటాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూల సంకేతాలు అందుకొనడం, ఉద్యోగ ప్రయత్నాలలో చిన్నచిన్న అవకాశాలు దొరకడం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరగడం జరుగుతుంది. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రోత్సాహం అధికారుల అనుకూలత బాగుంటుంది.

### కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

దూరప్రాంతములకు ప్రయాణాలు నిర్ణయం కావడం, గృహోపకరణాలు, సౌకర్యాలను పెంచుకొంటాడు. వ్యాపారవర్గాలకు ఆదాయము స్వల్పముగా పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాల ప్రయత్నాలు జరుపుతారు. పారిశ్రామిక యజమానులకు, వృత్తి జీవనము కలవారికి ప్రోత్సాహకరంగా పరిస్థితులుంటాయి. ఉద్యోగులకు పనిపై దృష్టి, అధికారుల ప్రోత్సాహం బాగుంటుంది.

### మీనం
పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు ప్రమోషన్లు, స్థానచలనము, అధిక బాధ్యతలు ఉండగలవు. స్పెక్యులేషన్లు రంగాలలో ఒడుదుడుకులుంటాయి. వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక వివాదాలు పరిష్కారమునకు రాగలవు. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు, గృహ మార్పుకై ప్రయత్నాలు సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూల సందేశాలుంటాయి.

# కమనీయం శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచార పరిషత్ ధార్మిక సలహా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు టిటిడి కల్యాణ మండపంలో ఇటీవల శ్రీ స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, నాగేంద్రశర్మ, గోవింద గిరిధర్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను కల్యాణవేదికపై కొలువుదీర్చి సుగంధ ద్రవ్యాలతో ఉభయ నాంచార సమేతంగా శ్రీవారికి తిరుమంజనసేవ నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో శ్రీనివాసుడు ఉభయదేవేరులకు మాంగల్య ధారణ గావించారు. ఈ కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు రమాదేవి బృందం తిరునామం దిద్దారు. పూర్ణచంద్రాచార్యులు వెంకటేశ్వర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా దేవతాసిస్టర్స్ తనుశ్రీ, రుషిక కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ముమ్మడి అరుణ, రమేష్, అల్లూరి లింగారెడ్డి, శ్రీలక్ష్మి, వసంతకుమారి ఉభయకర్తలుగా వ్యవహరించారు. టిటిడి ధార్మిక సలహామండలి మాజీసభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, టిటిడి కల్యాణ మండపం మేనేజర్ యల్.రామగోపాల్, వీరిశెట్టి సుధాకర్, హిందూధర్మప్రచారమండలి కోఆర్డినేటర్ డా॥యం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసులు తొందరగా పరిష్కరించాలి

## జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్



సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ బి.వి.రమణకుమార్

జిల్లా జనాభాలో 25శాతం ఎస్సీ, ఎస్టీలున్నారని, వారిపై దాడులు జరిగితే వెంటనే స్పందించి కేసులు నమోదు చేసి త్వరితగతిన కేసులను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం డయల్ 100 అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. డయల్100 ద్వారా బాధితులు ఫోన్ చేస్తే సిబ్బంది క్షణాల్లో సంఘటనాస్థలానికి చేరుకొని సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఈ నెల 11న ఉగాదిరోజు డయల్ 100ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ యల్.టి.చంద్రశేఖర్, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


## పెళ్లి సంబంధాలు

### వధువు కావలెను

1. 1983 మార్చి 21 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(ఇ.ఇ.ఇ), యం.టెక్(యన్ఐటి), హర్యానా. ఉద్యోగం అసిస్టెంట్ ఇంజనీర్(టి.పి.ట్రాన్స్.కో), చీరాల. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయ కుటుంబం. ఆస్థి విలువ 25లక్షలు. జీతం నెలకు 35,000/-. స్వస్థలం ప్రకాశంజిల్లా.
2. 1984 మే 9 జననం. ఎత్తు 5'8". చదువు బి.టెక్(ఇ.సి.ఇ). ఉద్యోగం సీనియర్ ఇంజనీర్, అప్లికేషన్ మేనేజ్‌మెంట్, విప్రో లిమిటెడ్. హైదరాబాద్. జీతం నెలకు 50,000/-. ఆస్థి విలువ 4కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
3. 1985 జూన్ 4 జననం. ఎత్తు 6". చదువు బి.ఇ(కంప్యూటర్స్), మద్రాసు. ఉద్యోగం సిస్టమ్ అనలిస్ట్ మైటెక్ సాఫ్ట్ సొల్యూషన్స్, హైదరాబాద్. జీతం నెలకు 25,000/-. ఆస్థివిలువ 4కోట్లు వాటా. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1984 ఆగష్టు 28 జననం. ఎత్తు 5'10". చదువు యం.సి.ఏ(మద్రాసు). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, యల్.ఏసాఫ్ట్, బెంగుళూరు. జీతం నెలకు 60,000/-. ఆస్థివిలువ 50లక్షలు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1980 నవంబరు 18 జననం. ఎత్తు 5'11". చదువు యం.సి.ఏ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. బెంగుళూరు. జీతం నెలకు 53,000/-. ఆస్థివాటా 75లక్షలు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా.

### వరుడు కావలెను

6. 1990 మార్చి 14 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(ఇఇఇ), కర్నూలు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థివాటా 50లక్షలు. స్వస్థలం కడపజిల్లా.
7. 1982 డిసెంబరు 18 జననం. ఎత్తు 5'2". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(అమెరికా). ఉన్నతమైనరెడ్డి వ్యవసాయకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
8. 1984 అక్టోబరు 1 జననం. ఎత్తు 5'5". చదువు బి.టెక్(ఇసిఇ), కుప్పం. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థి విలువ 11/2కోటి. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుత నివాసం బెంగుళూరు.
9. 1988 ఆగష్టు 8 జననం. ఎత్తు 5'4". చదువు బి.కాం, యం.బి.ఏ. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్థివిలువ 1కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా.
10. 1980 జూన్ 17 జననం. ఎత్తు 5'4". చదువు యం.యస్.సి(కంప్యూటర్స్). ఉద్యోగం టెస్ట్ ఇంజనీర్ సి.యం.సి. లిమిటెడ్(టి.సి.యస్) హైదరాబాద్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివాటా 1కోటి. స్వస్థలం హైదరాబాద్.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4. C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version




## దానకర్ణ నవదీప్...



బాద్‌షా సినిమాలో విలన్ పాత్రలో కనిపించిన నవదీప్. మోహన్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని అవయవ దానం చేస్తానని ప్రమాణం చేసి హీరో అనిపించుకున్నాడు.


## మూ'వీ'క్షణం

## మకాం మారుస్తాడా...



ఈమధ్య తెలుగులో హిట్‌లకంటే ఫ్లాప్‌లు ఎక్కువిస్తున్న పూరీ జగన్నాథ్ తన మకాంని ముంబైకి మార్చే ఆలోచనలో వున్నాడు. బాంద్రాలో సొంతింటి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

## 26న వస్తున్న గ్రీకువీరుడు



కామాక్షి మూవీస్ పతాకంపై నాగార్జున హీరోగా నటిస్తున్న 'గ్రీకు వీరుడు' ఈ నెల 26న విడుదల కాబోతుంది. ఇప్పటికే ఈ చిత్రం ఆడియోకు మంచి స్పందన కనిపించింది. నయనతార నాగ్‌కు జంటగా నటించగా దశరథ్ దర్శకత్వం వహించారు.

## నేను సైతం...

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలివ్వడం ద్వారా తాను కూడా సమాజసేవలో పాల్గొంటున్నానని కాజల్ అంటుంది. 'బాద్‌షా'లో తన పాత్రని ఆమె ఆచరణలో కూడా చూపిస్తున్నట్లుంది.



## హిట్టుకొట్టిన ఫ్లాప్‌జంట



సిద్ధార్థ, తాప్సి జంటగా నటించిన 'చష్మేబద్దూర్' బాలీవుడ్ సినిమా ఇటీవల విడుదలై ప్రేక్షకుల ప్రశంశలందుకుంది. ఈ సినిమా విజయం అటు సిద్ధార్థకు ఇటు తాప్సికి మళ్ళీ ఊపిరిపోసినట్లైంది. ఎందుకంటే ఈమధ్య టాలీవుడ్‌లో వీళ్ళిద్దరికీ ఒక్క హిట్ కూడా లేదు.

## లోపించిన కొత్తదనం



టాలీవుడ్ స్టార్‌డైరెక్టర్లకు నాలుగైదు హిట్ సినిమాలను మిక్స్‌చేసి కొత్త సినిమా తీయడం బాగా వంటబట్టింది. రామ్‌చరణ్ 'నాయక్'గాని, ప్రభాస్ 'మిర్చి' గాని ఆ బాపతులోనివే. తాజాగా ఎన్టీఆర్ 'బాద్‌షా' కూడా నాలుగైదు హిట్ సినిమాలను మన కళ్ళకు కడుతుంది. శ్రీను వైట్ల ఊరకామెడీతో 'రెడీ', 'దూకుడు'లానే ఈ సినిమాని లాగించాడు.

## స్టైలిష్ ఎడిటర్ శేఖర్




ఇండస్ట్రీలో మంచి టాలెంటెడ్ ఎడిటర్‌గా పేరు తెచ్చుకున్న ఎ.ఆర్.శేఖర్, తాజాగా అల్లు అర్జున్ ప్రశంసలు కూడా పొందాడు. ప్రిన్స్ మహేష్‌బాబు నటించిన 'బిజినెస్‌మెన్'కు ఎడిటర్ శేఖర్‌బాబే. దీనికి మంచి ప్రశంసలు వచ్చాయి. అల్లు అర్జున్ 'ఇద్దరమ్మాయిలతో' సినిమాకి శేఖర్ చేసిన ఎడిటింగ్ బాగుందని టాక్.



# గూడూరు డివిజన్ వార్తలు

### సేవ, క్రీడా, కళా రంగాలలో

## ముందుకెళుతున్న ముని గిరీష్



రాజకీయాలలో వుంటున్నా కూడా సేవా కార్యక్రమాల్లో తనవంతు పాత్రను పోషిస్తున్నాడు గూడూరు కాంగ్రెస్ నాయకులు కె.మునిగిరీష్. రాజకీయాలకు అతీతంగా అందరితో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ తాను చేపట్టే కార్యక్రమాల ద్వారా అందరి మన్ననలు అందుకుంటున్నాడు ఈ యువనాయకుడు. నెల్లూరు వి.ఆర్ లాకాలేజీలో లా చదువుకొని, పాఠశాల స్థాయి నుండి మెగాస్టార్ చిరంజీవి అభిమానిగా వుంటూ 1983లో ఒక చిరంజీవి అభిమాన సంఘాన్ని స్థాపించి సినిమాలకే పరిమితం కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చిరంజీవి పేరుతో నిర్వహిస్తూ చిరంజీవి ప్రశంసలు అందుకున్నారు. 1989లో గూడూరు క్రికెట్ అసోసియేషన్‌ను స్థాపించి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. జిల్లాస్థాయిలో ప్రారంభమైన ఈ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహిస్తూ ఈ సంవత్సరం 2013లో రజతోత్సవం జరుపుకోబోతున్నారు. గూడూరులో త్రాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలను గమనించి 1989లో 1.20వేలరూపాయలతో ఒక వాటర్‌ట్యాంకర్ కొనుగోలు చేసి త్రాగునీటి కొరతను తీరుస్తున్నారు. గూడూరు పాత బస్టాండ్‌లో ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణీకులు ఎండకు, వానకు పడుతున్న ఇబ్బందులు గుర్తించి 1997లో లక్షాయాభై వేల రూపాయలతో ఒక బస్సుషెల్టర్‌ను నిర్మించగా ఈరోజు ఎంతో మంది ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంది. 1999లో రోటరీక్లబ్‌లో సభ్యుడుగా చేరి ఉత్సాహంగా అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ 2005-2006 సంవత్సరానికి రోటరీ అధ్యక్షులుగా ఎన్నుకోబడి తన సంవత్సర పదవికాలంలో గూడూరులో ఎంతో అందంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో రోటరీ స్వర్గధామం అనే పేరుతో ఒక శ్మశాన వాటికను 25లక్షలరూపాయల వ్యయంతో నిర్మించి అందరి ప్రశంసలు అందుకున్నారు. రోటరీలో జిల్లా అసిస్టెంట్ గవర్నరుగా 2011-12 సంవత్సరానికి పనిచేసారు. గూడూరులో క్రికెట్‌కు అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర మహిళ క్రికెట్ సంఘం వారు నెల్లూరు జిల్లా మహిళ క్రికెట్ అసోసియేషన్ బాధ్యతలు అప్పగించారు. ఎంతో మంది మహిళాక్రికెటర్లను తయారుచేసి జాతీయస్థాయిలో రాణించేందుకు ఎంతో కృషి చేశారు. గూడూరుకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. గూడూరులో సాంస్కృతిక సమ్మేళనము సంస్థ 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో సభ్యులుగా చేరి వెంటనే ప్రధాన కార్యదర్శి బాధ్యతను చేపట్టి సంస్థకు పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేసారు. ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో నాటికల పోటీలు, సాహిత్య సదస్సులు, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ గూడూరు ప్రజలను ఆనందపరవశులను చేస్తున్నారు. తన చిన్ననాటి స్నేహితుడు కనుపూరు హరిశ్చంద్రారెడ్డి వ్యాపార రీత్యా చెన్నైలో స్థిరపడి పుట్టిన గూడూరుకి సేవచేయాలన్న తలంపుతో కనుపూరు హరిశ్చంద్రారెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ ఏర్పాటుచేసి దానికి ఛైర్మన్‌గా గిరీష్‌ను నియమించారు. ఆ ట్రస్టు ద్వారా గూడూరు పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. పడమర గూడూరు ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్న సుమారు కోటి రూపాయలతో మోక్షధామము (శ్మశానము)కు కోఆర్డినేటర్‌గా ఉండి దాని నిర్మాణానికి సహకరిస్తున్నారు గిరీష్.

## నియోజకవర్గ అభివృద్ధికి చెమటోడుస్తా!



గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య అన్నారు. ఇటీవల ఆయన పట్టణంలోని సాధుపేట సెంటర్‌లో మురుగు కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని, గత ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా ఓటమిపాలైనా గూడూరు పట్టణ అభివృద్ధికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఇంకా చేస్తానని అన్నారు. ప్రధానంగా గూడూరులో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, రైల్వేస్టేషన్‌లో రెండో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు పట్టణంలో పలుచోట్ల సిసిరోడ్లు, మురుగు కాలువ నిర్మాణపనులు వేగవంతంగా చేపట్టినట్లు చెప్పారు. ఈ విషయంలో కూడా ప్రతిపక్షాలు విమర్శించడంలో అర్థం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కె.మునిగిరీష్, దేగా సురేష్, మనుబోలు ప్రసాద్‌రెడ్డి, బాబురెడ్డి, గామం రమణయ్య, జిలానీభాష, మదనపర్తి జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో మృత్యుఘోష



- నాలుగు నెలలుగా శవాలు ఇంట్లోనే
- అనుమానాస్పదరీతిలో తల్లీ, కూతురు మృతి



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

**ఇటీవల అనుమానాస్పదమృతి సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. రకరకాల కారణాలతో ఒకే కుటుంబంలోని వ్యక్తులు ఇళ్ళలోనే చనిపోయిన చాన్నాళ్ళకు అవి వెలుగులోకి రావడం, వాళ్ళు ఎలా చనిపోయారో అంతు పట్టకపోవడం, పోలీసుల దర్యాప్తులో నిదానంగా ఆ మిస్టరీ వీడడం జరుగుతోంది.**

గూడూరులో గంటెపల్లి విమలమ్మ(62) ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసి రిటైర్ అయ్యి, కూతురు రాణి(31)తో ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. వీరు వుంటున్న ఇంట్లో 8 పోర్షన్లలో 8కుటుంబాలు నివాసం వుంటున్నాయి. చుట్టుప్రక్కల వారితో వారికి పరిచయాలు తక్కువ. వీరు ఇంట్లోనే అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం ఈనెల 7న వెలుగులోకి వచ్చింది. వారు మృతిచెంది నాలుగైదు నెలలయి వుంటుందని అంచనా. విమలమ్మ కుమారుడు కమలాకర్ తిరుపతిలో వుంటున్న కారణంగా పని వత్తిడితో వీరిని కలుసుకోవడం జరగలేదు. గత అక్టోబర్‌లో అతను గూడూరుకు వచ్చి చూసినప్పుడు ఇంటికి తాళం వేసి వుండడం గమనించి ఇంటి యజమానిని ప్రశ్నించగా ఆయన తెలియదని సమాధానమివ్వడంతో కమలాకర్ "అమ్మా ఇంటికొస్తే నా నంబర్‌కు ఫోన్ చేయండి" అంటూ లెటర్ వ్రాసి ఇంట్లోకి వేసాడు. వారు కనిపించడం లేదని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. తరువాత ఇంటి అద్దె కమలాకర్ ఇంటి యజమానికి చెల్లిస్తున్నట్టు తెలిసింది.

ఫోన్ ద్వారా కూడా ఎటువంటి ఆచూకీ దొరకనప్పుడు ఇంటి యజమాని కాని, కొడుకు గాని వారి గురించి ఇన్నాళ్ళు పట్టించుకోకపోవడం విడ్డూరంగా వుంది. శవాలు కుళ్ళిపోయి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారి ద్వారా ఈ సంఘటన వెలుగులోకి రావడంతో గూడూరు డిఎస్పీ టి.వి.హనుమంతరావు ఆధ్వర్యంలో సిఐ ఉప్పాల సత్యనారాయణ, ఒకటవ టౌన్ ఎస్సై షరీఫ్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ విద్యుత్ మోసం

విద్యుత్ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని, ఎప్పుడో వినియోగించిన ఇంధన సర్దుబాటు ఛార్జీలను ఇప్పుడు వసూలు చేయడం ఏమిటని వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. 6వ తేదీ ఆ పార్టీ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్‌లో కరెంటు భారంపై ప్రజాబ్యాలెట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు గూడూరు రాజేశ్వరరెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాసిన నాగులు, నెలబల్లి భాస్కరరెడ్డి మాట్లాడుతూ 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులపై భారం మోపలేదని చెబుతున్న ప్రభుత్వం 50యూనిట్లు దాటని నిరుపేద వినియోగదారునికి 72.50రూపాయలు బిల్లురాగా అదనపు సుంకం పేరుతో బిల్లుతో కలిపి ఆ వినియోగదారునికి 179రూపాయలు బిల్లు ఇవ్వడం ఏమిటని, ఇక సామాన్యునికి భారం ఎక్కడ తగ్గిందని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఎడాపెడా విద్యుత్ ఛార్జీలను పెంచడం వలన ఇటు రైతాంగం, అటు పారిశ్రామికరంగం పూర్తిగా నాశనమైందన్నారు. కార్యక్రమంలో ఎంబేటి చంద్రయ్య, బొమ్మిడి శ్రీనివాసులు, దాసరి వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి మధురెడ్డి, పరుచూరి సుబ్రహ్మణ్యం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# నమ్మకానికి చిరునామా.. "నిప్పో" సుబ్బారావు



పొట్టేపాటి ఓబుళరెడ్డికి ఆయన నమ్మిన బంటు. నిప్పో బ్యాటరీల తయారీ పరిశ్రమ "నిప్పో" ఫ్యాక్టరీలోని ఉద్యోగులకు ఆయన కనిపించే దైవం. ఆయన పేరు తేలపోలు వెంకటసుబ్బారావు. పుట్టింది ప్రకాశం జిల్లా చిన్నగంజాంలో. చదివింది కృష్ణాజిల్లాలో. పట్టభద్రుడై స్థిరపడింది చెన్నైలో. బ్రిటీష్ లైలాండ్ గ్రూప్‌కు చెందిన ఎన్నూర్ ఇండస్ట్రీస్‌లో 15సంవత్సరాలు పనిచేసిన అనంతరం 1980 సంవత్సరంలో ఇండోనేషనల్ లిమిటెడ్ (నిప్పో ఫ్యాక్టరీ)లో అడుగు పెట్టాడు.

కార్మికుల సమ్మెలతో కొందరు స్వార్థ కార్మిక నాయకుల కుటిల రాజకీయాలతో అన్నింటినీ మించి మావోయిస్టు పార్టీ ప్రభావంతో అతలాకుతలమై తన మనుగడే ప్రశ్నార్థకంగా జిల్లా పారిశ్రామిక రంగం సతమతమవుతున్న తరుణంలో "నిప్పో" ఫ్యాక్టరీ సైతం ఇలాంటి పరిస్థితులకు అతీతమేం కాలేదు. ఒక దశలో పోలీసు కవాతు సైతం నిర్వహించే స్థాయిలో అక్కడ సమ్మెలు జరిగాయి. ఇక నిప్పో మూసేస్తారన్న తరుణంలో 1980లో సీనియర్ పర్సనల్ మేనేజర్‌గా నిప్పో కుటుంబంలోకి అడుగు పెట్టాడు టి.వి.సుబ్బారావు.

తాను రంగప్రవేశం చేసిన వెనువెంటనే హెచ్.ఆర్. విభాగం సహాయసహకారాలతో యాజమాన్య విధానాలలో సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని కార్మికులకు భరోసా కల్పించడమే కాకుండా వారి జీవన విధానాలలో మార్పులు తీసుకురావడానికి కృషి చేశాడు సుబ్బారావు. నిప్పోలో అమలు చేసిన పలు సంస్కరణల ద్వారా సంస్థ అనూహ్య పురోగతిని సాధించడంతో పాటు జిల్లాలో ఇతర పరిశ్రమలకు నిప్పో కార్మికులు ఆదర్శంగా నిలిచే స్థాయికి సంస్థ ఎదిగింది. అనతికాలంలోనే ఉత్పత్తిలో మంచి ఫలితాలను సాధించి అగ్రస్థానంలో నిలిచింది.

కార్మికులను యంత్రాలతో సరిసమానంగా భావించకుండా ఎప్పటికప్పుడు వారి అవసరాలను గుర్తిస్తూ, వారి కుటుంబ సభ్యులతో సహా విహారయాత్రలను ఏర్పాటు చేయడం, సిబ్బంది జన్మదిన వేడుకలను అందరూ కలసి జరుపుకోవడం, "గ్రాండ్ మ్యూజికల్ నైట్" పేరుతో సంస్థ వార్షికోత్సవాల సందర్భంగా మొత్తం పిల్లాపెద్దలూ అందరూ కలసి సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుకోవడం, నూతన సంవత్సర సంబరాలను నిర్వహించుకోవడంతో పాటు రామేశ్వరం నుండి అమృత్‌సర్ వరకు అన్ని ఆధ్యాత్మిక కేంద్రాలకు కార్మికులతో పాటు ఫ్యాక్టరీ కార్యాలయ(అడ్మినిస్ట్రేటివ్) సిబ్బంది కలసి మెలసి వెళ్ళి స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించుకోవడంలో సుబ్బారావు కృషి అభినందనీయం. పారిశ్రామిక "శాంతి"కి మారుపేరుగా నిప్పో ప్రాంగణాన్ని ఆయన తీర్చిదిద్దారు.



స్వర్గీయ నందమూరి తారకరామారావుతో



మహానేత వైయస్ ప్రశంసలందుకుంటూ...





చంద్రబాబు నుండి అభినందనలందుకుంటూ



రోశయ్య ద్వారా సత్కారం పొందుతూ...

సుబ్బారావు నాయకత్వంలో పలు అవార్డులను ప్రశంసలను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సంస్థ సాధించింది. దాదాపు నలగురు ముఖ్యమంత్రుల చేతుల మీదుగా తమ సంస్థ పక్షాన అవార్డులను స్వీకరించిన ఘనత కూడా సుబ్బారావుదే. సంస్థ ఛైర్మెన్ కీర్తిశేషులు పి.ఓబుళరెడ్డి పలు సందర్భాల్లో సుబ్బారావు ప్రతిభను, ఆయన చేపట్టిన సంస్కరణలను, సాధించిన ప్రగతిని కొనియాడారు. ఓబుళరెడ్డి కుమారుడు ద్వారకానాథ్‌రెడ్డి సహాయసహకారాలు ఆశీస్సులు అన్ని విషయాలలో పొందగలిగిన అదృష్టవంతుడు సుబ్బారావు.

హెచ్.ఆర్(హ్యూమన్ రిసోర్సస్) విభాగంలో వివిధ స్థాయిలలో తన సేవలు సమర్థవంతంగా అందిస్తూ అంచెలంచెలుగా తన విజయప్రస్థానాన్ని సాగించి సంస్థలో అత్యున్నత స్థానమైన ప్రెసిడెంట్ ఆపరేషన్స్ స్థాయికి ఎదిగిన కృషీవలుడు సుబ్బారావు. నెల్లూరుతోనూ నెల్లూరుజిల్లా వాసులతోనూ ఆయనకు మంచి పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు వున్నాయి. దాదాపు 33 సంవత్సరాల పాటు "నిప్పో" సేవలో తరించి 2013 మార్చి 31వ తేదీన సుబ్బారావు పదవీ విరమణ చేశారు.

నిప్పో సుబ్బారావుగా, టి.వి.సుబ్బారావుగా ప్రాచుర్యం పొందిన ఆయన 1949 ఏప్రియల్ 17వ తేదీ చిన్నగంజాంలోని ఒక సామాన్య ఉప్పువ్యాపారస్తుల కుటుంబంలో జన్మించాడు. తన ప్రతిభా నైపుణ్యాలతో విశేష గుర్తింపుని సాధించి తాను పనిచేసే సంస్థకు మంచి గుర్తింపును తేవడంతో పాటు తన పురోగతికి బాటలు వేసుకుంటూ నేడు మంచిస్థాయిలో పదవీ విరమణ పొందారు. ఒకవైపు తన ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే మరోవైపు అనేక సమాజ సేవా కార్యక్రమాలలో సైతం ఆయన తన వునికిని చాటుకున్నాడు. పలు జాతీయ అంతర్జాతీయ సంస్థలలో సభ్యుడిగా కొనసాగడంతో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను తన నాయకత్వంలో విజయవంతంగా నిర్వహించిన చరిత్ర కూడా సుబ్బారావుకుంది.

అటు పొట్టేపాటి కుటుంబానికి ఆప్తుడుగా ఇటు వందలాదిమంది ఉద్యోగులకు ఆత్మీయుడిగా తన పదవీ ప్రయాణాన్ని సాగించి విశ్రాంత జీవితంలోకి అడుగిడిన సుబ్బరావుకి "లాయర్" అభినందనలు.

# కిరణ్ పంతం

(మొదటిపేజీ తరువాయి)

కాని 2002లో పెంచిన కరెంట్‌ఛార్జీలతో ప్రజలకు ఒక్కసారిగా విలన్ అయ్యాడు. కరెంట్‌ఛార్జీల కోపాన్నంతా ప్రజలు 2004ఎన్నికలలో తీర్చుకున్నారు. మరి చంద్రబాబు ఉదంతం పెద్ద ఉదాహరణగా వుంది. కరెంట్‌ఛార్జీల దెబ్బకు చంద్రబాబు రెండుసార్లు అధికారానికి దూరమయ్యాడు. ఇంకెన్ని సార్లు ఎన్నికలు జరిగినా ఆయన చేతికి అధికారం వస్తుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే జనం ఆయనను నమ్మడం లేదు.

మరి కిరణ్ కూడా చంద్రబాబు బాటలోనే పోతున్నాడంటే కాంగ్రెస్‌ను నిలబెట్టాలనే ఆలోచన కిరణ్‌కు లేదు. ఏడాదిలో ఎన్నికలు పెట్టుకుని కరెంట్‌ఛార్జీలను ఆయన ఇంత ధైర్యంగా పెంచగలిగాడంటే దానివెనుక ఉద్దేశ్యం కూడా అదే! రాష్ట్రంలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడమే అంతిమ లక్ష్యం లాగుంది.

2004-09ల మధ్య ముఖ్యమంత్రిగా వైయస్. ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టాడు. ప్రజలమీద రూపాయి అదనపు భారం మోపలేదు. ప్రజలకు ఎన్నెన్నో కొత్త కార్యక్రమాలు తెచ్చాడు. కరెంట్ ఛార్జీల జోలికి అసలు పోలేదు. వై.యస్. ఇన్నిచేస్తే 2009ఎన్నికలలో అరకొర మెజార్టీతో గెలిచాడు. వై.యస్. చేసినవన్నీ కిరణ్ ఎత్తేసాడు. అదనంగా ఛార్జీలు, సర్‌ఛార్జీల పేరుతో ప్రజలను బాదుతున్నాడు. మరి ఈ ప్రభావం రేపటి ఎన్నికలపై పడకుండా వుంటుందా? కరెంట్‌ఛార్జీలను ఒకసారి పెంచిన పాపానికే చంద్రబాబు పూర్తిగా అధికారానికి దూరమవ్వాల్సి వస్తుంది. కిరణ్ కరెంట్‌ఛార్జీలనే కాక అన్నిరకాల ఛార్జీలు, పన్నులను విపరీతంగా పెంచాడు. మరి ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో ఇంకెన్నాళ్లకు కోలుకుంటుందో...!

జగన్ మీద కక్షతో కాంగ్రెస్ అధిష్టానం వేస్తున్న తప్పటడుగులు కూడా రాష్ట్రంలో ఆ పార్టీ పతనాన్ని శాసిస్తున్నాయి. జగన్ కేసు విషయంలో బలహీన వర్గాలకు చెందిన మోపిదేవి వెంకట రమణను మాత్రం బలిచేసారు. ఆయన ఇప్పటికీ జైలులోనే వున్నాడు. అదే జగన్ కేసులో ముద్దాయిలుగా సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేసిన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సబితా ఇంద్రారెడ్డిలను మాత్రం ప్రభుత్వం కాపాడుతోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ కులవివక్షచూపిస్తుందనే విషయం అందరికీ అర్థమైపోయింది. మోపిదేవి ఒక్కడినే జైలుకు పంపి మిగతా మంత్రులను కాపాడుతుండడంతో బలహీనవర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు దూరమయ్యారు. ఇప్పటికే రెడ్డి సామాజికవర్గంతో పాటు ముస్లింలు, క్రిస్టియన్‌లు కాంగ్రెస్‌ను వీడి వైయస్సార్ కాంగ్రెస్‌కు దగ్గరయ్యారు. మంత్రుల కేసుల వ్యవహారాలు, మోపిదేవి జైలు విషయంతో బలహీనవర్గాలకు మండింది. ఇలా కాంగ్రెస్‌పార్టీకి అన్ని వర్గాలను దూరం చేసిన ఘనత కిరణ్‌దే! సమీప భవిష్యత్‌లో ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం దక్కే అవకాశం లేదు. ప్రస్తుతతరం వారికి ఈ రాష్ట్ర చివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డే! ఇది నిజం.

# అన్నదమ్ముల సవాల్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నుండి వెళ్లగొట్టాడు. నందమూరి కుటుంబానికి జూనియర్ ఎన్టీఆర్‌ను దూరం చేయాలని చూసిందీ చంద్రబాబే! అదే జూనియర్‌ను 2009ఎన్నికలలో వాడుకున్నదీ చంద్రబాబే! ఎన్నికల తర్వాత మళ్ళీ అదే ఎన్టీఆర్‌ను దూరంగా పెట్టేసాడు. అయితే చంద్రబాబు ఎంతో ముందుచూపుతో వ్యవహరించి బావమరిదిగా వున్న బాలకృష్ణను వియ్యంకుడిగా మార్చుకోవడం ద్వారా ఆ కుటుంబం మొత్తం నుండి తనకు రాజకీయ ముప్పు లేకుండా చేసుకోగలిగాడు. ఇప్పుడు చంద్రబాబు మీద నందమూరి హరికృష్ణ తిరగబడితే బాలకృష్ణ మాత్రం బాబుకు అండగా నిలుస్తున్నాడు. మొత్తానికి ఒకనాడు నందమూరి వంశంలో తండ్రీ కొడుకులను విడదీసిన చంద్రబాబు ఇప్పుడు అన్నదమ్ముల మధ్య అగ్గిబరాటా సృష్టించాడు. దటీజ్ రాజకీయం.

# సెలబ్రేషన్స్ వెజ్‌టిఫిన్స్

ఇప్పటికే నెల్లూరీయుల ఆదరాభిమానాలు అందుకున్న మాగుంట లేఅవుట్‌లోని సెలబ్రేషన్స్ మల్టిక్యూసైన్ రెస్టారెంట్ వారు కొత్తగా భోజనప్రియులకు సెలబ్రేషన్స్ టిఫిన్స్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. మాగుంట లేఅవుట్ మెయిన్‌రోడ్డులోనే ఈ నెల 13వ తేదీ ఉదయం 8గంటల నుండి ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీద మస్తాన్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీమేయర్ భానుశ్రీ, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, యువజన కాంగ్రెస్ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి పాల్గొననున్నారు.

• బాగుపడుతున్న రహదారులు

# మారనున్న మాగుంట లేఅవుట్ రూపురేఖలు

నెల్లూరు నగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా పేరొందిన మాగుంట లేఅవుట్‌లో ఇంతకాలం అభివృద్ధి అంతంత మాత్రంగానే వుండేది. అయితే గత కొంతకాలంగా రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మాజీమేయర్ భానుశ్రీలు ప్రత్యేక చొరవ చూపబట్టి ఈ ప్రాంతానికి రోడ్లు, డ్రైన్లు వంటి పనులు మంజూరవుతున్నాయి. మాగుంట లే అవుట్ అండర్‌బ్రిడ్జి నుండి బెజవాడ గోపాలరెడ్డి బొమ్మ వరకు మెయిన్‌రోడ్డు విస్తరణ కోసం ఇప్పటికే 2కోట్ల రూపాయలు మంజూరు చేసివున్నారు. కాగా తాజాగా వెంకటేశ్వరస్వామి మందిరం పక్కన సెంట్రల్ అవెన్యూలోని 60 అడుగుల మెయిన్‌రోడ్డును విస్తరించేందుకు కోటి 90లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు మాజీమేయర్ భానుశ్రీ గురువారం మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్‌కు తెలియజేశారు. ఈ రోడ్డు మాగుంట లేఅవుట్‌కు గుండె లాంటిది. ఈ రహదారి బాగుపడితే ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయి.

# స్టేడియం వాకర్స్ ఉగాది సంబరాలు




ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు దర్గామిట్టలోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం విజయనామ సంవత్సర ఉగాది సంబరాలు వేడుక చేసాయి. ఆలూరు శిరోమణిశర్మచే పంచాంగ పఠనం చేసిన తదుపరి అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాఘవేంద్రషెట్టి, కార్యదర్శి ఎన్.బలరామయ్యనాయుడు పర్యవేక్షణలో ఉగాది పచ్చడి, ఇస్కాన్ టెంపుల్ వారి లడ్డు ప్రసాదం వాకర్స్‌కు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డా॥ యం.వి.రావు, యంజిఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 203 ఎస్.వి.రామ్మోహన్‌రావు, బులెటిన్ ఎడిటర్ శ్రీరామమూర్తి, 203 డిస్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్ సి.సీతారామయ్య, యం.యఫ్.జి ఎలక్ట్ గవర్నర్ నేతాజీ సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టుకు ఎస్.రాఘవేంద్రషెట్టి, డా॥ కె.అంకిరెడ్డి, జి.రత్నం, పి.విజయమోహన్‌రెడ్డి, వి.హజరత్ బాబులు ఒక్కొక్కరు రూ.10,000 చొప్పున మొత్తం నగదు రూ.50,000 విరాళం ఇచ్చారు. ట్రస్ట్ జాతీయ అధ్యక్షులు డా॥ యం.వి.రావు వీరిని యంజిఎఫ్ బిరుదుతో సత్కరించారు.

PDF Compressor Free Version



# డా॥ సి.యం.కె.కు అంతర్జాతీయ గౌరవం



తమిళనాట తెలుగు వారికి, అందులోనూ నెల్లూరువారికి తోడుగా నీడగా కొండంత అండగా నిలుస్తున్న వ్యక్తి డాక్టర్ సి.యం.కె.రెడ్డి. 4దశాబ్దాలుగా చెన్నైలో స్థిరపడి ఎన్నో వేలమందికి వైద్యసేవలే కాక సామాజికంగా కూడా ఎన్నో సేవలు అందించిన ఈ వైద్యనారాయణుడిది మన నెల్లూరు జిల్లానే. వైద్యరంగంలో ఆయన సాధించిన అవార్డులకు, రికార్డులకు కొలమానం లేదు. ఆయన ప్రతిభను గుర్తించబట్టే ఎన్నో పదవులు ఆయనను వెదుక్కుంటూ వచ్చాయి. ఎటువంటి బాధ్యతలు తీసుకున్నా దానికి సంపూర్ణ న్యాయం చేకూర్చే వరకు సియంకె నిద్రపోడు ఇంకొకరిని నిద్రపోనివ్వడు. నలుగురుకి మంచి చేయడంలో ఆయన పడుతున్న శ్రమను, తపనను గుర్తించే మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం ఆయన్ను వెదుక్కుంటూ వచ్చింది. ప్రొఫెసర్ సియంకె రెడ్డి ఇటీవల జాతీయ మానవహక్కుల సంఘం దక్షిణ భారతదేశ ఛైర్మెన్‌గా నియమితులయ్యారు. ఈ గౌరవం చాలా అరుదైనది. అంతర్జాతీయంగా కూడా ఈ సంస్థకు ప్రత్యేక గుర్తింపు వుంది. ఆ సంస్థ సియంకెని ఈ పదవికి ఎన్నుకున్నదంటే ఆయన ఖ్యాతి ఎక్కడిదాకా విస్తరించిందో ఇట్టే అర్థమవుతుంది. అమూల్యమైన వైద్యసేవలు అందించి ఎన్నో సంస్థలకు గౌరవ ప్రతినిధులుగా వున్న సియంకె రెడ్డి జాతీయ మానవహక్కుల సంఘం దక్షిణభారతదేశ ఛైర్మెన్‌గా నియమితులవ్వడం నెల్లూరీయులందరికీ ఆనందదాయకం. ఈ సందర్భంగా ఆయనకు 'లాయర్' అభినందనలు.



కేంద్రమంత్రి కె.చిరంజీవి ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి విచ్చేసి తన మిత్రుడు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆనం కుటుంబసభ్యులతో ఆయన పలు విషయాలు ముచ్చటించారు.

# ఏసిబి డిఎస్పీకి 'మహోన్నత సేవా పతకం'



రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు ఏసిబి డిఎస్పీ భాస్కరరావుకు 2013-14 సంవత్సరానికి "మహోన్నత సేవాపతకం" ప్రకటించింది. 1985లో పోలీస్‌శాఖలో ఎస్సైగా అడుగిడిన భాస్కరరావు విధి నిర్వహణలో రాజీపడని వ్యక్తిగా పేరు సంపాదించారు. నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో 1993 నుంచి 2001 వరకు ఏసిబి సిఐగా పనిచేశారు. 1997లో సేవాపతకం, 2004లో ఉత్తమ సేవాపతకం, 2007లో ఇండియన్ పోలీసు మెడల్‌ను అందుకున్నారు. 2012 జనవరి నుంచి నెల్లూరు, ప్రకాశంజిల్లాల ఏసిబి డిఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నెల్లూరు, ప్రకాశంజిల్లాల్లో 15ఏసిబి ట్రాప్‌లు, 8ఆకస్మికదాడులు నిర్వహించారు. 2011లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం సిండికేట్ల వ్యవహారంలో ఎలాంటి ఒత్తిళ్ళకు లొంగకుండా వ్యవహరించారు. దాదాపు 10ఏళ్ళ పాటు అవినీతి నిరోధకశాఖలో పనిచేస్తూ ఎందరో అవినీతి అధికారుల భరతం పట్టారు. ఈ ఏడాది ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన ముఖ్యమంత్రి చేతులమీదుగా మహోన్నత సేవాపతకంను అందుకోనున్నారు.


# స్వర్ణభారత్‌లో ఉగాది ఉత్సవాలు

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని స్వర్ణ భారత్‌ట్రస్ట్‌లో బుధవారం ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకుడు యం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం కోరేవారు తెలుగుభాషను ఖచ్చితంగా మాట్లాడేవారై ఉండాలన్నారు. టీవీలు, సినిమాల వల్ల యువత మన సంస్కృతి సంప్రదాయాలను మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇతర భాషలను నేర్చుకోవడం మంచిదేనని కాని తెలుగును విస్మరించడం సరికాదన్నారు. అనంతరం రచయిత పెరుగు రామకృష్ణ రచించిన 'పూలమ్మిన ఊరు' పుస్తకాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, పొగాకు బోర్డు ఛైర్మెన్ గోపాల్, సంగీత దర్శకుడు గంగాధరశాస్త్రి, స్వర్ణభారత్ ట్రస్ట్ సభ్యుడు అట్లూరి అశోక్, సిఇఓ శరత్‌బాబు, డైరెక్టర్ పద్మయ్య, జనార్ధన్‌రాజు పాల్గొన్నారు.



ఉగాది వేడుకలను ప్రారంభిస్తున్న యం.వెంకయ్యనాయుడు

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.



# ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం

## శ్రీ యేటూరు సుబ్బరామిరెడ్డి గారు

తేది 3.4.2013 బుధవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: యేటూరు సుబ్బమ్మ

కుమారుడు - కోడలు

**వై.వి.రామిరెడ్డి** - విజయలక్ష్మి

కూతురు - అల్లుడు

సరిత(పద్మ) - వాల్మేటి శ్రీనివాసులురెడ్డి

మనుమరాండ్రు - మనుమలు

శిల్పారెడ్డి - కమలాకర్‌రెడ్డి(స్విట్జర్లాండ్)

సింధురెడ్డి - నరేంద్రరెడ్డి(యు.ఎస్.ఏ)

అనూషరెడ్డి, B.Tech., అఖిలరెడ్డి, B.Tech.

ముదిమనుమలు

హన్సిత్‌రెడ్డి, పన్విత్‌రెడ్డి

**పెద్దకర్మ:** తేది 17.04.2013 బుధవారం నెల్లూరు నారాయణరావుపేట (పాత మునిసిపల్ ఆఫీసు దగ్గర)లోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు తెలియజేయడమైనది.

- వై.వి.రామిరెడ్డి

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.